## పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత మున్సిపల్ కమిషనర్

**నర్సాపూర్, మే 27, ప్రభాతవార్త:** మానత జాతి మనుగడకు ఉపయోగపడే పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని నర్సాపూర్ మున్సిఫల్ కమీషనర్ వెంకట్‌గోపాల్ అన్నారు. శనివారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా నర్సాపూర్ మున్సిఫల్ కార్యాలయంలో కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ అనే అంశం పై అవగాహన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో పాల్గొన్న మున్సిఫల్ కమీషనర్ వెంకట్‌గోపాల్ మాట్లాడుతూ పర్యావరణానికి అనుకూలంగా మానవ విదానాన్ని మార్చుకోవాలన్న నినాదంతో ప్రపంచ దేశాలకు భారతదేశం పిలుపునిస్తుందన్నారు. పర్యావరణ పరిరక్షణ ఏ ఒక్కరి వల్ల కాదని అందరి భాధ్యతతో నే సాధ్యమవుతుందని అన్నారు. ప్రపంచ మానవాళి మొత్తం పర్యావరణ పరిరక్షణకు కంకణబద్దులు కావాలన్నారు. ఈ పర్యావరణ పరిరక్షణకు గాను ముమ్ముందు ప్రజలకు అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు తదితర కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. మున్సిఫల్ కమీషనర్ వెంకట్‌గోపాల్ తో పాటు మేనేజర్ మధుసూధన్, ఏఈ కిష్టయ్య, సిబ్బంది, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.




## గజ్వేల్‌లో వివోఏల భిక్షాటన

**గజ్వేల్, మే 27 (ప్రభాతవార్త):** ఐకెపి వివోఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని, పలు సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన సమ్మెలో భాగంగా శనివారం గజ్వేల్ పట్టణంలో వివోఏలు భిక్షాటన చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య మాట్లాడుతూ రాష్ట్ర మంత్రులు ఉప ఎన్నికల సమయంలో వివోఏలకు వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చి ఇంత వరకు పెంచలేదని అన్నారు. వివోఏలకు కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వడంతో పాటు బీమా సౌకర్యం కల్పించాలని, సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి కార్డులు అందజేయాలని డిమాండ్ చేశారు. గ్రామ సమైక్య సంఘాల ద్వారా, మండల సమైక్యల ద్వారా వివోఏలకు జారీచేసిన షోకాజ్ నోటీసులను వెనక్కి తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు వెంకటచారి, వివోఏలు నిఖిత, రుక్మిణి, షౌకత్, బిక్షపతి, లత, రేణుక, కరుణాకర్, రాజు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీకాంత్‌రెడ్డి

## మోడీ తొమ్మిదేళ్ల పాలనా విజయాలను ప్రజలకు వివరించాలి

### బిజెపి జిల్లా అధ్యక్షులు : శ్రీకాంత్‌రెడ్డి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :** ప్రధాని నరేంద్రమోడీ సారథ్యంలో నడుస్తున్న కేంద్ర ప్రభుత్వ 9 యేండ్ల పాలనా విజయాలను ప్రజలకు వివరించాలని జిల్లా బిజెపి అధ్యక్షులు దూది శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో అయన పాల్గొని మాట్లాడారు. మోడీ 9 యేండ్ల పాలనపై మహాజన్ సంపర్క్ అభియాన్ పేరుతో నెల రోజుల పాటు ప్రత్యేక ప్రోగ్రామం ఏర్పాటు చేయడం జరిగిందని పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులకు అందించడంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు అందిస్తున్న విత్తనాలు, ఎరువుల రాయితీని ప్రతి రైతుకు వివరించాలన్నారు. రాష్ట్రంలో బిఆర్ఎస్ ప్రభుత్వం అవలంభిస్తున్న అవినీతికి అంతు తంతులేకుండా పోయిందన్నారు. రాష్ట్రంలో బిఆర్ఎస్ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం చేద్దామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వంగ రామచంద్రారెడ్డి, రామచంద్రరావు, విద్యాసాగర్, ఉపేందర్‌రావు, నరేష్, శివకుమార్, బైరి శంకర్, శ్రీనివాస్, సత్యనారాయణ, ఎల్లయ్య, సంతోష్, నరేష్, కిషోర్, వెంకట్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# రైతుల గోస ఎమ్మెల్యేకు పట్టదా

### బిజెపి ఆధ్వర్యంలో ధర్నా రాస్తారోకో
### స్వల్ప ఉద్రిక్తత : కారు అద్దాలు ధ్వంసం
### బిజెపి నాయకుల అరెస్ట్ స్టేషన్‌కు తరలింపు

**నర్సాపూర్, మే 27, ప్రభాతవార్త:** రైతులు ఆరుగాలం కష్టించి పండించిన పంటలను అమ్ముకోవడానికి అనేక ఇబ్బందులు పడుతున్నారని వెంటనే కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తరలించడానికి వెంటనే లారీల కొరత తీర్చాలని, ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తు నర్సాపూర్ బిజెపి నాయకులు శనివారం నర్సాపూర్ అంబెద్కర్ చౌరస్తాలో ధర్నా రాస్తారోకో నిర్వహించారు. ఈ ధర్నా నర్సాపూర్ అసెంబ్లీ బిజెపి కన్వీనర్ వాల్దాస్ మల్లేస్‌గౌడ్, నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ మురళీయాదవ్ ల అధ్వర్యంలో జరుగగా బిజెపి నాయకులు కౌన్సిలర్‌లు బుచ్చేష్‌యాదవ్, గోడ రాజెందర్, ఎరుకలి యాదగిరి, లతరమేశ్‌యాదవ్‌లు పాల్గొన్నారు. నర్సాపూర్‌లోని అంబేద్కర్ చౌరస్తాలో బిజెపి నాయకులు రైతులతో కలిసి ధర్నా రాస్తారోకో నిర్వహించారు. రైతుల సమస్యలు పరిష్కరించాలంటు రోడ్డు పై భైఠాయించి పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. సిఎం డౌన్‌డౌన్, ముఖ్యమంత్రి రాజీనామా చేయాలి. ఎమ్మెల్యే రాజీనామా చేయాలంటు నినదించారు. రైతుల సమస్యలు పరిష్కరించేంత వరకు కదిలేది లేదని భీష్మించుకు కూర్చున్నారు. రైతులు పంటలను కేంద్రాలకు తీసుకువచ్చి కొనుగోలు కేంద్రాల వద్ద నెల రోజుల పాటు పడిగాపులు కాస్తున్నా స్థానిక ఎమ్మెల్యేకు రైతుల గోస పట్టదా అని ప్రశ్నించారు. ధాన్యం తరలించడానికి లారీల కొరత ఉన్నా ఎమ్మెల్యే, అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. విషయం తెలుసుకున్న సిఐ షేక్‌లాల్ మధార్, ఎస్ఐ 2 శ్రీనివాస్ లు పోలీసు బలగాలతో సంఘటన స్థలానికి చేరుకొని ఆందోళన కారులకు నచ్చజెప్పె ప్రయత్నం చేసినా వినకుండా ధర్నా ను కొనసాగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టిఆర్ఎస్ రైతు ప్రభుత్వమని గొప్పలు చెప్పుకోవడం కాదు రైతుల సంక్షేమం కోసం పాటుపడాలన్నారు రైతులు ఆరుగాలం కష్టించి పండించిన పంటలకు మద్దతు ధరలు లేకుండా నామమాత్రంగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలు చేయకుండా రైతులను ఇబ్బందుల పాలు చేయడం ఎంత వరకు సమంజసమనిఅన్నారు. బిఆర్ఎస్ ప్రహుత్వం రైతు ప్రభుత్వం కాదు రైతు వ్యతిరేక ప్రభుత్వమని అన్నారు. రైతులను పీడిస్తునన బిఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దెదింపే వరకు పోరాటం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ ధర్నా రాస్తారోకోతో ఎక్కడి వాహనాలు అక్కడే బారీగా నిలిచిపోయాయి ట్రాఫిక్ స్తంబించి పోయింది .ఈ ధార్నాలో ఒక కారుఅదాలు ధ్వంసం చేయడంతో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది సిఐ షేక్‌లాల్ మధార్, ఎస్ఐ 2 శ్రీనివాస్ లు ఆందోళన కారులను చెదరగొట్టారు. అనంతరం ధర్నాలో కూర్చున్న బిజెపి నాయకులు మురళీయాదవ్, వాల్దాస్ మల్లేష్‌గౌడ్‌లను బలవంతంగా తీసుకువచ్చి పోలీసు వాహనంలో ఎక్కించుకొని పోలీస్ స్టేషన్ కు తరిలించారు. బిజెపి నాయకులు రైతులు నల్లబ్యాడ్జిలు ధరించి నిరసన వ్యక్తం చేపి ధర్నా రాస్తారోకో నలిపివేడం జరిగింది. ఈ ధర్నా వల్ల ట్రాఫిక్ అంతరాయం కలుగగా సిఐ షేక్ లాల్ మధార్ వాహనాలను తరిలించి ట్రాపిక్‌కు సవరించారు. ఈ ధర్నాలో నర్సాపూర్ అసెంబ్లీ బిజెపి కన్వీనర్ వాల్దాస్ మల్లేష్‌గౌడ్, నర్సాపూర్ మున్సిఫల్ చైర్మన్ మురళీయాదవ్ ల తో పాటు బిజెపి నాయకులు కౌన్సిలర్‌లు బుచ్చేష్‌యాదవ్, గోడ రాజెందర్, ఎరుకలి యాదగిరి, లతరమేశ్‌యాదవ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్ చౌరస్తాలో రాస్తారోకో చేస్తున్న బిజెపి నాయకులు మున్సిఫల్ చైర్మన్ మురళీయాదవ్, వాల్దాస్ మల్లేష్‌గౌడ్

## ధాన్యం కొనుగోళ్లు త్వరితగతిన పూర్తి కావాలి : జిల్లా కలెక్టర్

**సంగారెడ్డి బ్యూరో, మే 27, ప్రభాతవార్త:**

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల పురోగతిపై శనివారం సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభమవుతున్నందున త్వరితగతిన ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలని కొనుగోలు కేంద్రాల ఇంచార్జ్‌లకు సూచించారు. అదేవిధంగా కొనుగోలు చేసిన ధాన్యం వెంట వెంటనే లోడ్ చేసి రైస్ మిల్లులకు రవాణా చేయాలని, కచ్చితంగా ట్రక్ షీట్ ఉండాలన్నారు. ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ వేగవంతానికి కొనుగోలు చేసిన ధాన్యం రైస్ మిల్లులకు పంపడం విషయంలో కేంద్రాల ఇంచార్జ్‌లు, సూపర్‌వైజరీ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యానికి వెంట వెంటనే ట్యాబ్ ఎంట్రీ చేయాలని, జాప్యం చేయరాదని స్పష్టం చేశారు. రైస్ మిల్లులలో ధాన్యం దించుకోవడంలో జాప్యం జరగరాదని, మిల్లర్లు ఎక్కువ మంది హమాలీలను ఏర్పాటు చేసుకోవాలని రైస్ మిల్లర్లకు సూచించారు. ఎక్కడా లారీల కొరత రాకూడదని, ధాన్యం రవాణాకు లారీల సమస్య ఉన్న చోట తహశీల్దార్, ఎంపీఓ, పోలీస్ అధికారులు వాహనాల కొరత లేకుండా చూడాలని సూచించారు. ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ పూర్తయ్యే వరకు ఆయా శాఖల అధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా కొనుగోళ్ల ప్రక్రియ పూర్తి చేయాలని, చివరి ధాన్యం గింజ వరకు కొనుగోలు చేస్తామని రైతులకు భరోసానివ్వాలన్నారు. ఈ టెలికాన్ఫరెన్స్‌లో జిల్లా అదనపు కలెక్టర్ వీరారెడ్డి, డిఆర్‌డిఓ, డిఎస్ఓ, జిల్లా వ్యవసాయ శాఖ, జిల్లా మార్కెటింగ్ అధికారి, డిసిఓ, రెవెన్యూ డివిజనల్ అధికారులు, తహశీల్దార్లు, ఏడిఏలు, ఏఓలు, రైస్ మిల్లర్లు, ట్రాన్స్‌పోర్టు కాంట్రాక్టర్లు, ప్యాక్స్ సీఈఓలు, ఆయా శాఖల క్షేత్ర పరిధి అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# భూ సేకరణను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి

### అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు : కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్

**గజ్వేల్, మే 27 (ప్రభాతవార్త):** జిల్లాలోని రిజర్వాయర్‌ల ద్వారా చెరువులు నింపడానికి చేయ్యాల్సిన కాలువల భూ సేకరణ ప్రక్రియను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్ అధికారులకు సూచించారు. శనివారం గజ్వేల్ పట్టణంలోని ఐఓసిలో నీటిపారుదల శాఖ, రెవెన్యూ, సర్వే అధికారులతో ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డితో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్ రైతులకు మేలు చేయడానికి పెద్ద ఎత్తున రిజర్వాయర్‌లను యుద్ధ ప్రాతిపదికన నిర్మాణం చేశారని అన్నారు. జిల్లాలో రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ లాంటి రిజర్వాయర్‌ల నుండి మరియు తపాస్‌పల్లి రిజర్వాయర్ నుండి కాలువల ద్వారా జిల్లాలోని ప్రతి చెరువులో నీటిని నింపడానికి కావలసిన భూసేకరణను మండలాల వారీగా అధికారులతో చర్చించారు. భూసేకరణ ప్రక్రియలో రెవెన్యూ, సర్వేయర్‌ల పాత్ర కీలకం అన్నారు. ప్రతి గ్రామంలో ఏ ఒక్క చెరువు కూడా ఎండకుండా ఎండాకాలంలో సైతం నీటితో కలకలలాడితే రైతులకు ఎంతో మేలు చేసిన వాళ్ళమవుతామన్నారు. గ్రామాల్లో మండల తహసీల్దార్, సర్వేయర్లు ఆర్డీఓల సహకారంతో కాలువల భూసేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. సర్వేయర్ అందించిన భూసేకరణ సంబంధిత ఇరిగేషన్ అనుమతులను వెంటనే తహసీల్దార్‌లకు అందించిన వెంటనే రైతులకు నష్టపరిహారం అందజేసి భూమిని ఆధీనంలోకి తీసుకోవాలన్నారు. ఈ ప్రక్రియ యుద్ధ ప్రాతిపదికన జరగాలని అధికారులు పనుల్లో అలసత్వం ప్రదర్శిస్తే కఠిన నిర్ణయాలు తీసుకోవడంలో వెనుకాడబోమని హెచ్చరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్

కాలువలో భూమిని కోల్పోయిన రైతులు అధైర్యపడవద్దని మంచి పరిహారం ఇప్పిస్తామని తెలిపారు. మీ త్యాగం వల్ల జిల్లా మొత్తం సస్యశ్యామలం అవుతుందన్నారు. భూసేకరణ ప్రక్రియలో ఎలాంటి అవరోధాలు ఎదురైనా పక్కా ప్రణాళికతో పకడ్బందీగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కాగా సమావేశానికి ముందు మల్లన్నసాగర్ ముంపు గ్రామాల ఆర్అండ్ఆర్ కాలనీ వాసుల సమస్యలను కలెక్టర్‌కు తెలుపగా నిర్వాసితులకు అందాల్సిన నష్టపరిహారం, ఓపెన్ ప్లాట్లు, ఇతర మౌలిక వసతుల కల్పనకు సంబంధించి అన్నింటిని త్వరలో పరిష్కరిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట, గజ్వేల్ ఆర్డీఓలు రమేష్‌బాబు, విజయేందర్‌రెడ్డి, గడా ప్రత్యేకాధికారి ముత్యంరెడ్డి, గజ్వేల్ ఇరిగేషన్ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ వేణు, ఎడి సర్వేల్యాండ్ వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అప్పుల బాధతో యువకుడు మృతి

**పటాన్‌చెరువు, మే 27, ప్రభాతవార్త:** చేసిన అప్పులు చెల్లించలేక పటాన్‌చెరువు మండలం రుద్రారం గ్రామానికి చెందిన చంచల్‌పేట శ్రీనివాస్(38) తన ఇంట్లో ఉరి వేసుకొని మృతిచెందాడు. పోలీసులు, కుటుంబీకుల కథనం ప్రకారం. రుద్రారం గ్రామంలోని తోషిబా కంపెనీలో కాంట్రాక్టు లేబర్‌గా పనిచేస్తున్న శ్రీనివాస్ గత ఆరు నెలల క్రితం అతని తల్లి మరణించినప్పుడు అంత్యక్రియల నిమిత్తం, తన కుటుంబ అవసరాల నిమిత్తం తనకు తెలిసిన వారి వద్ద అప్పులు తీసుకున్నాడు. తర్వాత అట్టి అప్పులు చెల్లించడానికి శ్రీనివాస్ ఐడిఎఫ్‌సి బ్యాంకు నందు పర్సనల్ లోన్ తీసుకున్నాడు. తన ఆర్థిక పరిస్థితులు బాగా లేనందున శ్రీనివాస్ పర్సనల్ లోన్ యొక్క ఈఎంఐ గత కొంతకాలంగా చెల్లించలేదు. ఈ విషయంలో బ్యాంకు సిబ్బంది శ్రీనివాస్‌కు ఫోన్ చేసి లోన్ ఈఎంఐ చెల్లించమని వేధించి, లోన్ చెల్లించినట్లయితే ఇట్టి విషయం శ్రీనివాస్ స్నేహితులకు, బంధువులందరికీ తెలియజేసి బ్యాంకు అకౌంట్, ఆధార్‌కార్డును బ్లాక్ చేస్తామని బెదిరించడంతో శ్రీనివాస్ మానసిక శోభకు గురై శనివారం సాయంత్రం ఇంట్లో దూలానికి ప్లాస్టిక్ పైపుతో ఉరి వేసుకొని మృతిచెందాడు. తన భర్త మరణానికి బ్యాంకు సిబ్బంది వేధింపులే కారణమని మృతుడి భార్య లావణ్య పటాన్‌చెరువు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసు కొని దర్యాప్తు చేపట్టడం జరుగుతుందని ఎస్ఐ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు.

## జనవాసాల నుంచి డంపింగ్ యార్డున్‌ను తరలించాలి : ఎం.డి.ఇమామ్



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న అత్తు

**సిద్దిపేట రూరల్, మే 27, ప్రభాతవార్త :**

జిల్లా కేంద్రంలోని హౌసింగ్ బోర్డు కాలనీ సమీపంలో జనవాసాల నుంచి డంపింగ్ యార్డున్‌ను తరలించాలని పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎం.డి.ఇమామ్(అత్తు) డిమాండ్ చేశారు. శనివారం డంపింగ్ యార్డులో అగ్నిప్రమాదం ఘటనపై అయన విలేకరులతో మాట్లాడారు. ప్రజలు నివస్తున్న ప్రాంతంలో ఎవరిని సంప్రదించకుండా డంపింగ్ యార్డును ఎందుకు ఏర్పాటు చేశారని ప్రశ్నించారు. ఎలాంటి బీమా సౌకర్యం లేని వ్యక్తిని డంపింగ్ యార్డు నిర్వహణ బాధ్యత అప్పగించడం సరికాదన్నారు. జిల్లా కేంద్రంలో అగ్నిప్రమాదం జరిగితే ఇతర ప్రాంతాల నుంచి అగ్నిమాపక శకటం తెప్పించే పరిస్థితి నెలకొందన్నారు. అగ్ని ప్రమాదానికి కారణం ఎవరని ప్రశ్నించారు. అగ్ని ప్రమాద సంఘటనకు మున్సిపల్ చైర్మనే పూర్తి బాధ్యత వహించాలన్నారు. మంటలు పెద్దయెత్తున్న ఎగిసి పడడంతో ప్రజలు అందోళనకు గురియ్యారని అవేదన వ్యక్తం చేశారు. అస్థినష్టం పేరిట దోచుకునేందుకు అధికారులు ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. అయన వెంట పార్టీ నాయకులు గయాజుద్దీన్, బైరి సాయి శేఖర్, ఫయాజ్, మధు తదితరులు పాల్గొన్నారు.

# ప్రగతి ప్రస్థానాన్ని ప్రజలకు వివరించే విధంగా కార్యక్రమాలు చేపట్టాలి

### జిల్లా కలెక్టర్ రాజర్షిషా

**మెదక్ అర్బన్, మే27 ప్రభాతవార్త:**

జూన్ 2 నుండి చేపట్టనున్న తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో సాధించిన ప్రగతి ప్రస్థానాన్ని ప్రజలకు వివరించే విధంగా ఎలంటి లోటుపాట్లకు తావు లేకుండా చక్కటి కార్యాచరణతో కార్యక్రమాలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికారులకు సూచించారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడి వచ్చే జూన్ నాటికి తొమ్మిదేండ్లు పూర్తి చేసుకొని 10వ వసంతంలోకి అడుగిడుతున్న సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం 21 రోజుల పాటు పండుగ వాతావరణంలో రోజు ఒక కార్యక్రమం చొప్పున జూన్ 22 వరకు వివిధ శాఖల ద్వారా అమలు పరుస్తున్న వివిధ కార్యక్రమాలు ప్రజలకు తెలిసేలా కార్యక్రమాలు చేపట్టుటకు షెడ్యూల్ ప్రకటించిందన్నారు. శనివారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో అదనపు కలెక్టర్లు ప్రతిమ సింగ్, రమేష్‌లతో కలిసి ఆయా శాఖల నోడల్ అధికారులు చేపట్టవలసిన కార్యక్రమాలపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 9 ఏండ్ల తెలంగాణ ప్రస్థానంలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొన్నామని, రాష్ట్రం వచ్చిన కొత్తలో బాలారిష్టాలు, డి-మానిటైజేషన్, కోవిడ్ తదితర కారాణాల వల్ల ఎంతో విలువైన కాలాన్ని కోల్పోయిన అతి తక్కువ సమయంలో దేశం గర్వించదగ్గ స్థాయిలో అన్ని రంగాలలో పురోగమించామన్న సందేశాన్ని ప్రజలకు చేరే విధంగా వినూత్న రీతిలో కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఆమ శాఖ ఇచ్చే ఆదేశాలతో పాటు కార్యక్రమ షెడ్యూల్ ప్రకారం 2014కు పూర్వం ఇప్పటి వరకు సాధించిన ప్రగతిపై నియోజకవర్గం వారీగా, గ్రామ, మండల వారీగా వెంటనే నివేదిక అందజేయాలని సూచించారు. ఆదివారం ఉమ్మడి జిల్లా కలెక్టర్లతో రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి మెదక్‌లో సమీక్షించనున్నారని కలెక్టర్ తెలిపారు. నోడల్ అధికారులు తమ కార్యక్రమాల రోజు నాడు-నేడు పరిస్థితులపై అద్దం పట్టే విధంగా రూపొందించిన ఫ్లెక్సీలను ఏర్పాటు చేయాలని, అదేవిధంగా కరపత్రాలు, పుస్తకాలు ముద్రించి తమ కార్యక్రమం రోజు పంపిణీ చేయాలన్నారు. జిల్లాలోని ప్రధాన కార్యాలయాలు, ఏడుపాయల, ఖిల్లా, చర్చి ప్రదేశాలను 21 రోజుల పాటు విద్యుత్ దీపాతో అలంకరించాలన్నారు. ఆయా శాఖల అధికారులు నిర్వహించిన కార్యక్రమం అంతయూ డాక్యుమెంటేషన్‌తో పాటు వీడియో చిత్రీకరణ చేసి డాక్యుమెంటరీ రూపంలో అందించాలని సూచించారు. జూన్ 2న జిల్లా ఇంచార్జి మంత్రి చిన్నశంకరంపేటలో అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించిన అనంతరం కలెక్టరేట్ ఆవరణలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారని అన్నారు. 3న తెలంగాణ రైతు దినోత్సవం, 4న సురక్షా దినోత్సవం, 5న విద్యుత్ విజయోత్సవం, 6న పారిశ్రామిక ప్రగతి ఉత్సవం, 7న సాగునీటి దినోత్సవం, 8న ఊరూరా చెరువుల పండుగ, 9న సంక్షేమ సంబరాలు, 10న సుపరిపాలన దినోత్సవం, 11న సాహిత్య దినోత్సవం, 12న తెలంగాణ రన్, 13న మహిళా సంక్షేమం, 14న వైద్య ఆరోగ్యం, 15న పల్లె ప్రగతి, 16న పట్టణ ప్రగతి, 17న గిరిజనోత్సవం, 18న మంచినీళ్ల పండుగ, 19న హరితోత్సవం, 20న విద్య, 21న ఆధ్యాత్మిక దినోత్సవం, చివరగా జూన్ 22న అమరుల సంస్మరణ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అధికారులు వెంకటశైలేష్, చందు నాయక్, యేసయ్య, సత్యనారాయణరెడ్డి, జయరాజ్, కృష్ణమూర్తి, ఖాసీం, రవి ప్రసాద్, విజయశేఖర్‌రెడ్డి, భీమయ్య, రాధా కిషన్, రాజిరెడ్డి, రాజేంద్రప్రసాద్, కమలాకర్, శ్రీని వాస్, నాగరాజు, ఆశాకుమారి, బ్రహ్మాజీ, రజిని, ఇందిర, మున్సిపల్ కమీషనర్లు, ఆర్డీవో సాయిరాం పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ ఆరోగ్యం కోసం యోగా, రన్నింగ్, వాకింగ్ చేయాలి: అడిషనల్ డీసీపీ అడ్మిన్



5కే రన్‌ను ప్రారంభిస్తున్న అడిషనల్ డీసీపీ అడ్మిన్ మహేందర్ తదితరులు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :**

అరోగ్య సిద్దిపేటలో భాగంగా సిద్దిపేట టూ టౌన్ సీఐ రవికుమార్ అధ్వర్యంలో 5కే రన్ నిర్వహించడం సంతోషంగా ఉందని అడిషనల్ డీసీపీ అడ్మిన్ సందెపొగు మహేందర్ అన్నారు. సిద్దిపేట టూ టౌన్ పోలీసుల అధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన 5కే రన్‌ను అయన ఏసీపీ చల్లా దేవరెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సుతో కలిసి ప్రారంభించారు. 5కే రన్ పట్టణంలోని పాత బస్టాండు నుంచి కరీంనగర్ రోడ్డు నర్సాపూర్ ఎక్స్ రోడ్డు, వేములవాడ కమాన్, పత్తి మార్కెట్ మీదుగా తిరిగి వేములవాడ కమాన్ సమీపంలోని మైదానం వరకు సాగింది. ప్రతి ఒక్కరూ అరోగ్యం కోసం యోగా, రన్నింగ్, వాకింగ్ చేయాలన్నారు. అరోగ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. అరోగ్యాన్ని మించిందేమి లేదని..అరోగ్యంగా ఉంటే ఏదైనా సాధిస్తామన్నారు. నడక మనిషి జీవితంలో ఎన్నో మార్పులు తేస్తుందన్నారు. మనం అరోగ్యంగా ఉంటే కుటుంబమంతా అరోగ్యంగా ఉంటుందన్నారు. సీపీ శ్వేత అదేశాల మేరకు ప్రతి వారం రన్నింగ్ పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ మితమైన అహారం తీసుకోవడం చాలా ముఖ్యమన్నారు. ఏసీపీ దేవరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు తదితరులు మాట్లాడారు. 5కే రన్‌లో గెలుపొందిన మహిళలకు, పురుషులకు, పిల్లలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు. 400 మంది ఉత్సహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నర్సింగ్ కౌన్సిల్ సభ్యులు పాల సాయిరాం, కౌన్సిలర్లు సాకి బాల్‌లక్ష్మీఅనంద్, నాయిని చంద్రం, రియాజ్, అస లక్ష్మణ్, కత్తుల బాపురెడ్డి, పల్లె బాలకిషన్‌గౌడ్, బొమ్మల యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# తొమ్మిదేళ్లల్లో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

### ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

**పెద్దశంకరంపేట, మే27 ప్రభాతవార్త:** తెలంగాణ వచ్చాక ఈ తొమ్మిదేండ్లలో అన్ని వర్గాల ప్రజలకు ముఖ్యమంత్రి కేసీఆర్ న్యాయం చేశారని నారాయణఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని శివ్వాయిపల్లి గ్రామ శివారులో ఏర్పాటు చేసిన కార్యకర్త ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలు మన రాష్ట్రంలో అమలవుతుంటే ప్రతిపక్షాలు మాత్రం విష ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. రాష్ట్రాన్ని 60 సంవత్సరాల పాటు పాలించిన పార్టీలు ఏమి చేయలేదని, ఈ తొమ్మిది సంవత్సరాలలో బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కళ్యాణలక్ష్మీ, షాదీముబార్, పింఛన్లు, దళితబంధు, రైతుబంధు, డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణం లాంటి పథకాలను అమలు చేసిందని, త్వరలోనే గృహలక్ష్మీ పథకం ద్వారా అర్హులైన వారికి 3 లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందజేయనుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఏం అభివృద్ధి చేసింది ఈ సందర్భంగా ప్రశ్నించారు. నారాయణఖేడ్ నియోజకవర్గంలో కాంగ్రెస్ నాయకులు అధికారంలో ఉన్నప్పుడు ప్రజలను దోచుకోవడమే తప్ప అభివృద్ధిపై ధ్యాస పెట్టలేదని విమర్శించారు. నియోజకవర్గంలో 60 సంవత్సరాల్లో చేయలేని అభివృద్ధిని తాను ఎమ్మెల్యేగా ఉన్న ఈ 6 సంవత్సరాల కాలంలో చేశానని తెలిపారు. అదేవిధంగా బీజేపీ నాయకులు ప్రజలను వంచిస్తున్నారని, దేశ భక్తి, దైవ భక్తి ముసుగులో ప్రజల మధ్య భావోద్వేగాలను రెచ్చగొట్టి లబ్ధి పొందాలని చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపక్ష పార్టీ నాయకుల మాటాలను ప్రజలను నమ్మే స్థితిలో లేరన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ హ్యాట్రిక్ విజయం సాధించడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జంగం శ్రీనివాస్, జెడ్పీటీసీ విజయరామరాజు, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు మురళీ పంతులు, సర్పంచుల ఫోరం అధ్యక్షులు కుంట్ల రాములు, స్థానిక సర్పంచి రాములు, నాయకులు విగ్రం వేణుగోపాల్‌గౌడ్, సుభాష్‌గౌడ్, మాణిక్‌రెడ్డి, బక్కారెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

## మంచినీటి సమస్యను పరిష్కరించండి

### - జల మండలి ఎండి దాన కిషోర్‌కు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

**పటాన్‌చెరువు, మే 27, ప్రభాతవార్త:** పటాన్‌చెరువు నియోజకవర్గ పరిధిలోని అమీన్‌పూర్ మున్సిపాలిటీతో పాటు అమీన్‌పూర్ మండలం, పటాన్‌చెరువు డివిజన్ పరిధిలోని సింఫనీ కాలనీలో నెలకొన్న మంచినీటి సరఫరా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని జల మండలి ఎండి దాన కిషోర్‌ను పటాన్‌చెరువు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి కోరారు. శనివారం హైదరాబాద్‌లోని జల మండలి కార్యాలయంలో ఎండి దాన కిషోర్‌తో సమావేశమైన ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి వివిధ అంశాలపై చర్చించారు. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలో నూతనంగా ఏర్పాటు అవుతున్న కాలనీలకు మంచినీటిని అందించేందుకు గాను ఇప్పటికే మూడు రిజర్వాయర్ల పనులు ప్రారంభించామని, వీటిని త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పటాన్‌చెరువు డివిజన్ పరిధిలోని సింఫనీ కాలనీకి సైతం సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం ఉచితంగా మంచినీటిని అందించేందుకు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన ఎండి దాన కిషోర్ త్వరలోనే చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు.

# నీటిఎద్దడిలేని నియోజకవర్గంగా అంబర్‌పేట: ఎమ్మెల్యే కాలేరు


నల్లకుంటలో మంచినీటి పైప్‌లైన్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, చిత్రంలో కార్పొరేటర్ అమృత తదితరులు

హైదరాబాద్, మే 27 ప్రభాతవార్త : అంబర్‌పేట నియోజకవర్గంలో మంచినీటి సమస్యలేకుండా చర్యలు తీసుకోవడం జరిగిందని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. శనివారం నల్లకుంట డివిజన్ పరిధిలోని నర్సింహాబస్తీలో స్థానిక కార్పొరేటర్ వై.అమృతతో కలిసి 18లక్షల వ్యయంతో మంచినీటి పైప్‌లైన్ల పనులను ప్రారంభించారు. అనంతరం స్థానిక బస్తీలో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి కాలనీ, బస్తీల్లో ప్రజలకు మౌళిక సదుపాయల కల్పనకు పెద్దపీటవేస్తూ డ్రైనేజీ మంచినీటి వరద నీటి పైప్ లైన్ల ఏర్పాటు, సిసి రోడ్ల నిర్మాణం, విద్యుత్ స్తంభాలు, వీధి దీపాలు, పార్కుల అభివృద్ధి వంటి అనేక పనులు చేపడుతున్నామని తెలిపారు. తాను అంబర్‌పేట ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాతనే ఈ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు కనిపిస్తున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో అధికారులు, బిఆర్ఎస్, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

**విద్యుత్ సమస్యల సత్వర పరిష్కారానికి కృషి..** కాచిగూడ డివిజన్ కిషోర్ థియేటర్ లేన్‌లో రూ.10లక్షల వ్యయంతో నూతనంగా ఏర్పాటు చేయనున్న 500 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నిర్మాణపు పనులను శనివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతమున్న 315 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌పై ఓవర్‌లోడ్ పడి నిత్యం విద్యుత్ సమస్యలు వస్తుండటంతో స్థానిక ప్రజల విజ్ఞప్తి మేరకు 500 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను నూతనంగా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అనంతరం ఎమ్మెల్యే పాదయాత్ర నిర్వహించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రాత్రి సమయాల్లో పోకిరీల బెడత తీవ్రంగా ఉందని, ఈ దారి మీదుగా మహిళలు, వాహనదారులు వెళ్లాలంటేనే భయాందోళనలకు గురవుతున్నారని స్థానికులు తెలిపారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే నారాయణగూడ పోలీసు అధికారులకు సమస్యను వివరించి ఇక్కడ రాత్రి సమయాల్లో పెంట్రోలింగ్ ఏర్పాటుచేసి న్యూసెన్స్ చేసేవారిపై కేసులు బుక్ చేయాలని ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని పోలీసులకు సూచించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు భీష్మదేవ్, డాక్టర్ శిరీష, డాక్టర్ ఓంప్రకాష్‌యాదవ్, రాత్రిక్ నాగేందర్ బాబ్జి పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారంలో వేగం పెంచాల్సిందే

## గాజులరామారం డిప్యూటీ కమిషనర్ ప్రశాంతి


కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న గాజులరామారం డిప్యూటీ కమిషనర్ ప్రశాంతి

కుత్బుల్లాపూర్, మే 27 ప్రభాతవార్త : గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని డివిజన్లలో అభివృద్ధి పనుల నిర్వాహణతో పాటు ఫిర్యాదులపై ప్రత్యేకశ్రద్ద కనబర్చి ప్రజలతో మమేకం కావాలని గాజులమారం సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ప్రశాంతి విజ్ఞప్తిచేశారు. శనివారం కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయంలోని సమావేశమందిరంగా కుత్బుల్లాపూర్, గాజులరామారం సర్కిళ్లకు చెందిన వార్డు అడ్మినిస్ట్రేట్యూవ్ అధికారుల నియామకంతో పాటు వివిధ విభాగాల అధికారులకు ప్రత్యేకంగా బాధ్యతలను అప్పగించారు. ఈసందర్భంగా ప్రశాంతి మాట్లాడుతూ కుత్బుల్లాపూర్, గాజులరామారం సర్కిళ్ల పరిధిలోని ఎనమిది వార్డులకు గాను అడ్మినిస్ట్రేట్యూవ్ అధికారులను నూతనంగా నియమించినట్లు ఆమె తెలిపారు. గాజులరామారం డివిజన్‌కు శ్రీనివాస్, జగద్గిరిగుట్ట డివిజన్‌కు సునందిని, రంగారెడ్డినగర్ డివిజన్‌కు ఎంఎసి ఎంఎసి గిరిబాబు, చింతల్ డివిజన్‌కు జవహార్‌లాల్‌నాయక్, సూరారం డివిజన్‌కు హరిబాబు, సుభాష్‌నగర్ డివిజన్‌కు సి.హెచ్.కృష్ణ, కుత్బుల్లాపూర్ డివిజన్‌కు గిరిబాబు, జీడిమెట్ల డివజన్‌కు మంజులతలను అడ్మినిస్ట్రేటీవ్ అధికారులుగా నియమించినట్లు తెలిపారు. వీరికి వివిధ విభాగాల అధికారులు ఆయా దరఖాస్తుల పరిష్కారానికి బాధ్యత వహిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. వివిధ పత్రికలు, వాట్సప్, ఫేస్‌బుక్ వంటి మాధ్యమాల ద్వారా అందే ఫిర్యాదులతోపాటు ప్రజలు వార్డు కార్యాలయంలో స్వయంగా అందించే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించి ఉన్నతాధికారులకు సమాచారం అందించాలని ప్రశాంతి సూచించారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని ప్రతిఒక్క అధికారి, సిబ్బంది ప్రత్యేకశ్రద్ధతో విధులను నిర్వర్తించి గుర్తింపు తేవాలని సూచించారు.

# హత్య కేసులో ముగ్గురు నిందితుల అరెస్ట్



హత్యకు పాల్పడిన నిందితులు

దుండిగల్, మే 27 ప్రభాతవార్త : భార్యను కాపురానికి పంపించడం లేదని అత్తమామలపై ద్వేషాన్ని పెంచుకొని మామను హత్య చేసిన అల్లుడితో పాటు సహాకరించిన ఇద్దరిని దుండిగల్ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల వద్ద మూడు కత్తులు, రెండు ఫోన్లు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. సిఐ రామక్రిష్ణ తెలిపిన వివరాల ప్రకారం..దుండిగల్ మున్సిపాలిటీ చర్చిగాగిల్లాపూర్‌కు చెందిన రమేష్(54) మున్సిపల్‌లో వాటర్‌మెన్‌గా పనిచేసుకుంటూ కుటుంబసభ్యులతో కలిసి నివాసం ఉంటున్నాడు. రమేష్ కూతురు మహాలక్ష్మీ స్థానికంగా నివాసం ఉంటున్న తాండూర్ జిల్లా యాలాల మండలానికి చెందిన పాత నేరస్తుడు షేక్‌నజీర్ అలియాస్ అహ్మద్ అలియాస్ షేక్(31)ను 2021లో ప్రేమించి పెళ్ళి చేసుకొని ముంబాయికి పారిపోయింది. కొద్ది నెలల తరువాత ముంబాయిని నుండి వీకర్‌సెక్షన్‌లో నివాసం ఉంటున్నారు. షేక్ మహాలక్ష్మీపై అనుమానం పెంచుకోవడంతో భార్యభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. విసుగు చెందిన మహాలక్ష్మీ తల్లిగారి ఇంటికి వెళ్ళిపోయింది. తన భార్యను కాపురానికి పంపించాలని షేక్ అత్తమామలను కోరడంతో పద్దతి మార్చుకోవాలని సూచించారు. దీంతో అత్తమామలపై ద్వేషాన్ని పెంచుకొని తన మామను అడ్డుతొలగించుకోవాలనుకున్నాడు. పథకం ప్రకారం తన స్నేహితులు తన్నీరు కోటేశ్వరరావు అలియాస్ రాకీ(24), కంచేరి మహేందర్(22) ఫర్దీన్(23)లతో కలిసి షేక్‌నజీర్ 16డిసెంబర్2022 రోజు మధ్యాహ్నం 12:30గంల సమయంలో ఒంటరిగా వెళ్తున్న మామ రమేష్‌పై కత్తులతో దాడి చేసి హత్య చేశారు. చుట్టపక్కల వాళ్ళు గమనించి కేకలు వేయడంతో అక్కడి నుండి పారిపోయారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నాటి నుండి నిందితులు పోలీసులకు చిక్కకుండా తప్పించుకు తిరుగుతున్నారు. కాగా షేక్‌నజీర్ సూరారం పరిసర ప్రాంతాల్లో తిరుగుతున్నట్లు విశ్వసనీయ సమాచారం అందుకున్న పోలీసులు శనివారం ఓ రెస్టారెంట్ వద్ద ఎ-1 నజీర్, ఎ-2 కోటేశ్వరరావు, ఎ-4 మహేందర్‌లను అదుపులోకి తీసుకొని విచారించగా నేరం అంగీకరించారు. నిందితుల వద్ద మూడు కత్తులు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. కాగా ఎ-3 ఫర్దీన్ పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు.

# అభివృద్ధి పనులపై సమీక్షా సమావేశం నిర్వహించిన ఎమ్మెల్యే


క్యాంప్ కార్యాలయంలో మణికొండ మున్సిపల్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

నార్సింగి, మే 27 ప్రభాతవార్త : మణికొండ మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులపై రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న మిషన్ భగీరథ ఫేజ్-2లోని రిజర్వాయర్ల నిర్మాణం? పైప్‌లైన్ల నిర్మాణం? వంటి విషయాలపై జల మండలి అధికారులను ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రిజర్వాయర్ల నిర్మాణం పనులు 80.శాతం పూర్తి అవ్వడం జరిగిందని, 60.శాతం పైప్‌లైన్ల పనులు పూర్తయ్యాయని తెలిపారు. రెండేళ్లకు సంబంధించిన నీటి బిల్లులు ఒక్కసారి కట్టాలనడం మంచిది కాదని, మండు వేసవిలో ప్రజలను ఇబ్బంది పెట్ట వద్దని అధికారులను ఆదేశించారు. జల మండలి ఎండి దానకిషోర్‌తో మాట్లాడి నీటి ఇబ్బందులు రాకుండా చూస్తానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. పంచవటి కాలనీ నుంచి ఎస్ఎన్‌డిపి కింద నిర్మితమవుతున్న బాక్స్‌డ్రైన్ పనులు నెక్నాంపూర్ చెరువు వరకు పొడగించే విధంగా మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని తెలిపారు. నిత్యం రద్దీగా ఉండే ఫ్రెండ్స్ కాలనీ జంక్షన్, ఆంధ్రాబ్యాంక్ జంక్షన్, మర్రి చెట్టు జంక్షన్‌ల వద్ద ట్రాఫిక్ పోలీసులను నియమించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలని పోలీసులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. ఫ్రెండ్స్ కాలనీ నుంచి బిఆర్‌సి వరకు, పంచవటి నుంచి మర్రిచెట్టు వరకు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన రోడ్ల వెడల్పు కార్యక్రమాన్ని త్వరగా చేపట్టాలని సూచించామన్నారు. రేడియల్ రోడ్లు బిఆర్‌సి నుంచి ఓఆర్ఆర్ వరకు త్వరగా చేపట్టాలని అధికారులకు తెలిపామన్నారు. పార్కులు, కమ్యూనిటీహాళ్ల నిర్మాణం త్వరగా చేపట్టాలని కమిషనర్‌ను ఆదేశించామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సమావేశంలో జల మండలి జీఎం రవీందర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఫల్గుణ్ కుమార్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ రామకృష్ణారెడ్డి, ఆల్ కాలనీస్ సంక్షేమ సంఘాల సమాఖ్య అధ్యక్షులు సీతారాం ధూలిపాళ, కార్యదర్శి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రధాన గేటు కూల్చివేత, గోడ నిర్మాణం


కూలగొట్టిన భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్‌ప్రధాన గేటు



బేగంపేట మే 27,ప్రభాతవార్త : సికింద్రాబాద్ భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్‌సికింద్రాబాద్ జిల్లా హెడ్ క్వార్టర్స్ ఆవరణ లోని అవుట్ గేటును శనివారం ఉదయం గం 7ల సమయంలో పోలీసులు, జీహెచ్ఎంసీ డీఆర్ఎఫ్ సిబ్బందితో కలిసి వచ్చిన అగ్ని మాపక శాఖ అధికారులు కూల్చివేసారు. మరో ప్రాంతంలో ఉన్న ఇన్‌గేట్‌ను కూడా కొంత మేర తొలగించే ప్రయత్నం చేసారు. సికింద్రాబాద్ భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్‌మరియూ సికింద్రాబాద్ అగ్ని మాపక కేంద్రం మధ్య స్థల వివాదం తలెత్తింది. ఈ క్రమంలో తమకు చెందిన అవుట్ గేటును తొలగించే క్రమంలో తాము ఎందుకు కూలగొడుతున్నా రంటూ ప్రశ్నించిన భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రతినిధులపై పోలీసులు దురుసుగా ప్రవర్తించారని వారు ఆరోపించారు. 1930లో తమకు ప్రభుత్వం భూమి కేటాయించిందని, అప్పటి నుంచి తాము ఉన్నామన్నారు. ముందు వైపు రెండు గేట్లు ఏర్పాటు చేసుకున్నామన్నారు. అయితే శనివారం ఉదయం ఈ స్థలం తమదే నంటూ ఫైర్ స్టేషన్ సిబ్బంది వాదించడంతో పాటు కూల్చివేతలు చేపట్టారని, తాము మీకు కేటాయించినట్లు దస్తా వేజులు చూపమని అడిగితే రెవెన్యూ అధికారులను కలవాలంటూ చెపుతున్నారని, కనీసం నోటీసులు కూడా ఇవ్వకుండా ఇలా చేయడం సరైంది కాదని వారు ఆరోపించారు. ఫైర్ శాఖ అధికారులు 2014లో తమకు నీళ్ల ట్యాంకు ఏర్పాటు చేసుకునేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్‌కు అగ్నిమాపకశాఖ అధికారులు అర్జీ పెట్టారే తప్ప వారికి ఎలాంటి హక్కు లేదని ఆరోపించారు. ఈ ఘటనపై అగ్ని మాపక శాఖ అధికారులు మాత్రం తాము ఏమి మాట్లాడలేమని ఉన్నతాధికారులు మాట్లాడుతారంటూ పేర్కొనడం గమనార్హం.

# యేసుక్రీస్తు బోధనలు అనుసరణీయం

## హెబ్రోన్ చర్చి సొసైటీ ఛైర్మన్ జోసఫ్ పి కురియన్

ధర్నాచౌక్, మే 27, ప్రభాతవార్త: యేసు క్రీస్తు బోధనలు సదా అనుసరణీయమైనవని ప్రముఖ హెబ్రోనన చర్చి సొసైటీ ఛైర్మన్ జోసఫ్ పి కురియన్ అన్నారు. శనివారం గోల్కొండ చౌరస్తాలోని హెబ్రోన్ చర్చిలో నిర్వహించిన 57వ అఖిల భారత యౌవనస్తుల కూడికలు ముగింపు వేడుకల సందర్భంగా చర్చి పరసర ప్రాంతాలలో సువార్త గీతాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా యేసు క్రీస్తు రాకడ కొరకు యువత సిద్ధపడాలి అనే అంశంతో బైబిల్ లోని బోధనలు చేశారు. యౌవనస్తుల కూడికల ముగింపు వేడుకలు ఘనంగా నిర్వహించుకునేందుకు సహకరించిన పోలీస్‌శాఖ, జలమండలి, విద్యుత్, జీహెచ్ఎంసీ తదితర శాఖల అధికారులకు వారు కృతజ్ఞతలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ప్రధాన కార్యదర్శి ఆర్.వీరాచారి తదితరులు పాల్గొన్నారు.

# కేసిఆర్ పథకాలు దేశంలోనే ఆదర్శం : పద్మారావు గౌడ్


58వ జీవో కింద ఇంటి పట్టాను అందజేస్తున్న డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ తదితరులు

అడ్డగుట్ట, మే 27 ప్రభాతవార్త: పేద ప్రజల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి కేసిఆర్ ప్రవేశపెట్టిన పథకాలు దేశంలోనే ఆదర్శంగా నిలిచాయని, ఆ పథకాలను అమలు పర్చడంలో తెలంగాణ రాష్ట్రం అగ్రస్థానంలో నిలిచిందని అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ టీ.పద్మారావు గౌడ్ తెలిపారు. అడ్డగుట్ట ప్రాంతానికి చెందిన ఇద్దరు లబ్దిదారులు 58 జీవో కింద దరఖాస్తు చేసుకున్న లబ్దిదారులకు శనివారం పద్మారావు గౌడ్ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో అడ్డగుట్ట కార్పోరేటర్ లింగాని ప్రసన్న శ్రీనివాస్, సీతాఫల్ మండి కార్పోరేటర్ సామల హేమ తదితరులు పాల్గొన్నారు.

# సిక్ విలేజ్ ఖాదర్ వలి దర్గాలో శ్రీగణేష్ ప్రార్థనలు


సిక్ విలేజ్ ఖాదర్ వలి దర్గాలో ప్రార్థనలు నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు శ్రీగణేష్

బేగంపేట మే 27,ప్రభాతవార్త : సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గం పరిధిలోని సిక్ విలేజ్ చౌరస్తాలోని ఖాదర్ వలి దర్గాలో శనివారం ఉర్సు ఉత్సవాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ బీఆర్ఎస్ నాయకులు శ్రీగణేష్ పాల్గొని ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీగణేష్‌ను, బోర్డు మాజీ సభ్యులు బి.ప్రభాకర్‌లను దర్గా కమిటీ నిర్వహకులు శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సాదిక్, శరత్, గౌతమ్, పవన్ సంతోష్ లికేష్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# హైకోర్టు స్టే ఎత్తివేయించి ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి

## ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి


దీక్షనుద్దేసించి ప్రసంగిస్తున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

ధర్నాచౌక్, మే 27, ప్రభాతవార్త: బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్‌పై హైకోర్టులో ఉన్న స్టే ఎత్తివేయించి, తక్షణమే ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ పూర్తి చేయాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో పాఠశాల విద్య నిర్లక్ష్యానికి గురవటాన్ని నిరసిస్తూ దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా నర్సిరెడ్డి మాట్లాడుతూ విద్యాశాఖ నిర్లక్ష్యం కారణంగానే బదిలీలు పదోన్నతుల షెడ్యూల్‌పై హైకోర్టులో స్టే వచ్చిందని ఆరోపించారు. విద్యాశాఖ హైకోర్టులో అప్పీల్ చేస్తే స్టే ఎత్తివేస్తారని, తక్షణమే విద్యాశాఖ స్పందించి, స్టే ఎత్తివేయించాలని కోరారు. మోడల్ స్కూల్స్‌లో బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ ప్రకటించి వెంటనే పూర్తి చేయాలని సూచించారు. ఈ కుబేర్ లో మార్చి 2023 వరకు పెండింగ్‌లో ఉన్న బిల్లులన్నింటినీ తక్షణమే చెల్లించాలని, కేజీబివి, యుఆర్ఎస్ మరియు సమగ్ర శిక్షణలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, ఉద్యోగులకు మినిమం బేసిక్‌పేను వేతనంగా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటిఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు కే.జంగయ్య, చావ రవి మరియు ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# క్యూనెట్ బాధితులకు న్యాయం చేయాలి

## ఆప్ తెలంగాణ కోర్ కమిటీ సభ్యులు, క్యూనెట్ బాధితుల జేఏసీ కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్


ధర్నానుద్దేసించి ప్రసంగిస్తున్న సుధాకర్

ధర్నాచౌక్, మే 27, ప్రభాతవార్త: ఉద్యోగాలు వస్తాయనే ఆశతో విహాన్ డైరెక్ట్ సెల్లింగ్ ప్రైవేట్ లిమిటెడ్ (క్యూనెట్) సంస్థలో డబ్బుపెట్టి మోసపోయిన బాధితులకు డబ్బు ఇప్పించి న్యాయం చేయాలని క్యూనెట్ బాధితుల జేఏసీ కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో క్యూనెట్ బాధితుల జేఏసీ ఆధ్వర్యంలో ఆరని మంటల పోరాటం పేరుతో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా నుద్దేసించి సుధాకర్ మాట్లాడుతూ క్యూనెట్ లాంటి సంస్థలు మోసపూరిత కార్యకలాపాలకు పాల్పడుతూ అమయకులను బలి తీసుకుంటున్నాయని ఆరోపించారు. స్వప్నలోక్ కాంప్లెక్స్ అగ్నిప్రమాదంలో మరణించిన ఆరుగురు బాధితులు క్యూనెట్‌లో 22 లక్షల డిపాజిట్లు పెట్టారని, వారి కుటుంబాలకు కూడా డబ్బులు తిరిగి రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే క్యూనెట్ బ్రాంచీలలో లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టిన 300 మంది బాధితులకు డబ్బులు తిరిగి ఇప్పించాలని, ఈ అక్రమాలపై సిట్ దర్యాప్తు చేయించి, క్యూనెట్ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో ఆప్ కోర్ కమిటీ సభ్యులు బుర్రరాముగౌడ్, నేతలు అన్సారీ, రాకేష్‌సింగ్, జావేద్, మజీద్, ఫణిభూషణ్, క్యూనెట్ బాధితుల జేఏసీ నేతలు ఆనంద్, మమత, మురణి, వినయ్, కళ్యాణి, కృష్ణవంశి, రామకృష్ణ, దీప్తి తదితరులు పాల్గొన్నారు.

# బోయిన్‌పల్లిలోని వాహన దారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

## ట్రాఫిక్ డిసిపి రాహుల్ హెగ్డె

కంటోన్మెంట్,మే 27 ప్రభాతవార్త: దేశంలో వివిధ దళాలకు చెందిన యువత శత్రువులో జరిగిన పోరాటంలో కంటే ఎక్కువ మంది రోడ్డు ప్రమాదంలో చనిపోవడం, గాయపడడం జరుగుతుందని నగర ట్రాఫిక్ డిసిపి రాహుల్ హెగ్డె తెలిపారు. శనివారం బోయిన్‌పల్లిలోని ఎయిర్‌పోర్ ్సనుూ ్కల్‌లో నిర్వహించిన వైమానిక దళ శిక్షణ సంస్థ నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరై ప్రసంగించారు. దేశ వ్యాప్తంగా ఎసంవత్ ్సరానికి 350 మంది ప్రాణాలు కోల్పోయారన్నారు. విమానాలు నడుపడం కొరకు శిక్షణ పొందిన అధికారులు వాహన ప్రమాదాలలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వైమానిక దళ శిక్షణ సంస్థ అధికారులు కెప్టెన్ మానీస్ కుమార్, కెప్టెన్ సుమన్, లెఫ్టినెంట్ కల్నల్ రాఖేష్ చంద్ర, ట్రాఫిక్ శిక్షణా సంస్థ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, తిరుమలగిరి ట్రాఫిక్ సిఐ పురుషోత్తమ్ రావ్, ఎయిర్‌పోర్ట్స్ అధికారులు సోలంకి, రాబర్ట్ తదితరులు పాల్గొన్నారు.

# ఉస్మానియా ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్యసేవలు : డాక్టర్ బి.నాగేందర్

## ఉస్మానియా ఆసుపత్రికి రూ:9.5 కోట్ల విలువైన పరికరాలు అందచేత

అప్జల్‌గంజ్, మే 27 ప్రభాతవార్త: వైద్యం కోసం వచ్చే రోగులను అదుకునేందుకు బహుళజాతి సంస్థ ముందుకు రావడం అభినందనీయమని ఉస్మానియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి.నాగేందర్ అన్నారు. హైదరాబాద్ ఏరోనాటికల్ ఇంజనీరింగ్ లిమిటెడ్ సంస్థ ప్రతినిధుల బృందం సూపరిండెంటెంట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటిలో భాగంగా ఆసుపత్రికి 9కోట్ల 50లక్షల విలువైన వైద్య పరికాలను అందించారు. సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగంలో కాలేయ శస్త్రచికిత్సల కోసం ఈ పరికరాలు ఉపయోగపడుతాయని నాగేందర్ తెలిపారు. ప్లాస్టిక్, సర్జరీ, న్యూసర్జరీ వంటి సూపర్ స్పెషాలిటి విభాగాలలో ఆపరేటింగ్ విలువైన వైద్య, పరికరాలు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉస్మానియా వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శశి కళారెడ్డి, హెచ్ఏఎల్ సంస్థ ప్రతినిధులు అరున్, జె.సర్కటే, వినత సర్కేటే, ఉమేష్, చంద్రమహంతి, రామకిషోర్, సూర్యకాంత్, సుమన్‌చంద్ర, దేశ్‌పాండే, శివనానసింగ్, భూపాల్, వివిధ విభాగాల అధిపతులు, ఆర్ఎంఓలు తదితరులు పాల్గొన్నారు.

# న్యాయవాదుల రక్షణకై ప్రత్యేక చట్టం తేవాలి: ఆర్ కృష్ణయ్య



అడ్వకేట్ ధర్నాకు మద్దతు తెలుపుతున్న ఆర్.కృష్ణయ్య

ధర్నాచౌక్, మే 27, ప్రభాతవార్త: సమాజంలో న్యాయాన్ని కాపాడటం కోసం నిత్యం నేరస్తులతో పోరాడే న్యాయవాదుల రక్షణకై ప్రత్యేక చట్టం తేవాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య అన్నారు. శనివారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో ట్రస్టెడ్ అడ్వకేట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన దీక్ష చేపట్టారు. ఈ దీక్షకు మద్దతు తెలిపిన అనంతరం కృష్ణయ్య మాట్లాడుతూ స్టేషన్‌లో బెయిల్ ఇవ్వటం వల్ల శాంతిభద్రతలకు విఘాతం కలిగే ప్రమాదం ఉంటుందని, పోలీస్ శాఖకు న్యాయవ్యవస్థను అప్పగించటం సరికాదని, తక్షణమే స్టేషన్ బెయిల్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జూనియర్ అడ్వకేట్‌లకు మన పక్క తెలుగురాష్ట్రంలో పదివేల రూపాయలు స్టైఫండ్ ఇస్తూ ఉంటే మన తెలంగాణ రాష్ట్రంలో ఇవ్వకపోవటం అన్యాయమని అన్నారు. ప్రభుత్వం రాష్ట్రంలో సమస్యలపై దృష్టి పెట్టకుండా కేవలం కమీషన్ వ్యవహారాలపైనే దృష్టి పెడుతోందని ఆరోపించారు. అవినీతి సమాజంపై, వ్యవస్థలో ఉన్న లోపాలపై అడ్వకేట్స్ పోరాడాలని పిలుపునిచ్చారు. న్యాయవాదుల సమస్యలపై పార్లమెంటులో లేవనెత్తి సమస్యలు పరిష్కారం అయ్యేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అసోసియేషన్ అధ్యక్షులు రాజారావ్ మాట్లాడుతూ కొత్తగా ప్రాక్టీసులోకి వచ్చిన న్యాయవాదులు అందరికీ కూడా ఇన్సూరెన్స్ కల్పించాలని, న్యాయవాదులు అందరికీ ఇండ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు శివకుమార్, సురేందర్, ఎస్.సంతోష్‌కుమార్, సంపత్‌కుమార్, నిరజ్‌ఠాకూర్, న్యాయవాదులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# పాతబస్తీలో ఘనంగా నెహ్రూ వర్ధంతి


లాల్‌దర్వాజ మోడ్ వద్ద జరిగిన పండిత్ జవావర్ లాల్ నెహ్రూ వర్ధంతిలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

చార్మినార్, మే 27 ప్రభాతవార్త : పాత బస్తీ లాల్‌దర్వాజ మోడ్ వద్ద శనివారం మాజీ ప్రధానమంత్రి పండిత్ జవహర్ లాల్ నెహ్రూ వర్ధంతి కార్యక్రమం చార్మినార్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి కె.వెంకటేష్ ఆధ్వర్యంలో జరిగింది. వెంకటేష్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు నెహ్రూ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ ప్రధానమంత్రి పండిత్ జవహర్ లాల్ నెహ్రూ దేశాభివృద్ధికి చేసిన సేవలు చిరస్మరణీయమని తెలిపారు. పాతబస్తీ కాంగ్రెస్ నాయకులు కె.సురేష్ బాబు, జి.శ్రీనివాస్, మూసాఖాశిం, బాలాజీతో పాటు పలువురు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

**జూపార్కులో నెహ్రూ 59వ వర్ధంతి..** పాతబస్తీ బహదూర్‌పుర శివారులో ఉన్న నెహ్రూ జూలాజికల్ పార్కులో శనివారం మాజీ ప్రధానమంత్రి పండిత్ జవహర్‌లాల్ నెహ్రూ 59వ వర్ధంతి కార్యక్రమం జరిగింది. టిపిసి సి కార్యదర్శి కె.కన్నయ్యలాల్, కాంగ్రెస్ నాయకులు సయ్యద్ ముజాహిద్, మూసాఖాశిం, ముజీబుల్లా షరీఫ్, సయ్యద్ ఇక్బాల్, మహ్మద్ బబ్బార్, యూసుఫ్, దనిష్ ఆమీర్ హాష్మీలు పండిత్ జవహర్‌లాల్ నెహ్రూ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.


సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన యోగా మహోత్సవ్ కార్యక్రమంలో మాజీ మేయర్ బండ కార్తికచంద్రారెడ్డి ఇతర నేతలు

# విద్యార్థులు నిరంతరం కష్టపడి చదవాలి : చార్మినార్ ఏసిపి రుద్ర భాస్కర్




చార్మినార్, మే 27 ప్రభాతవార్త : విద్యార్థులు నిరంతరం కష్టపడి చదివితే తప్పకుండ ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని చార్మినార్ ఏసిపి రుద్ర భాస్కర్ అన్నారు. సక్సెస్ ఫెడరేషన్ ఆఫ్ ప్రైవేట్ స్కూల్స్ ఆధ్వర్యంలో శనివారం కిల్వత్‌లోని ఉర్దూమస్కాన్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఎస్ఎస్‌సి పరీక్షలలో ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు మెరిట్ అవార్డులను ప్రధానం చేశారు. ఈ సందర్భంగా చార్మినార్ ఏసిపి రుద్ర భాస్కర్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాలలోను చురుకుగా పాల్గొనాలని తెలిపారు. సక్సెస్ ఫెడరేషన్ ఆఫ్ ప్రైవేట్ స్కూల్స్ అధ్యక్షులు ఖాలీద్ అన్సారీ మాట్లాడుతూ విద్యార్థులను ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతోనే 20 పాఠశాలలకు చెందిన 200 మంది ఎస్ఎస్‌సి విద్యార్థులకు మెరిట్ అవార్డులను ప్రధానం చేశామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సోహెల్ ఖాద్రి, ముక్తదర్ బాబా, సాహిల్ అక్బర్, బహదూర్‌పుర జోన్ ఉప విద్యాశాఖాధికారి ముక్రం, ఫెడరేషన్ ప్రతినిధులు ఇంజనీరు సయ్యద్ హైదర్ అలీతో పాటు పలు పాఠశాలల కరస్పాండెంట్లు పాల్గొన్నారు.

# కరాటేలో వరల్డ్ రికార్డు సాధించిన అక్కాచెల్లెల్లు


అక్కాచెల్లెల్లను సన్మానిస్తున్న ఎడ్లసుధాకర్‌రెడ్డి, డైరెక్టర్ గోపాల్‌రెడ్డి

హైదరాబాద్, మే 27, ప్రభాతవార్త: జివిఆర్ కరాటే అకాడమీలో శిక్షణ పొందుతున్న జి.అమృతరెడ్డి, జి.గానసంతోషిని రెడ్డిలు వరల్డ్ రికార్డు సాధించారు. 81 సెల్ఫ్ డిఫెన్స్ టెక్నిక్స్ 9 నిమిషాల్లో పూర్తి చేసి రికార్డు నెలకొల్పారు. ఈమేరకు శనివారం అకాడమీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అకాడమీ డైరెక్టర్ గోపాల్‌రెడ్డి, అంబర్‌పేట నియోజకవర్గ బిఆర్ఎస్ ఇంచార్జ్ ఎడ్ల సుధాకర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ పులిజగన్, గరిగంటి రమేష్, దేవిరెడ్డి విజితారెడ్డితదితరులు హాజరై వారిని సన్మానించారు. ఈకార్యక్రమంలో నాయకులు నాగేష్, ఎం.జనార్ధన్, జెడి రాహుల్, దిలీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రంలో ధాన్యం లోడింగ్‌ను పరిశీలిస్తున్న తహశీల్దార్ చంద్రశేఖర్‌రావు

## ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన తహశీల్దార్ చంద్రశేఖర్‌రావు

**కొల్చారం, మే27 ప్రభాతవార్త:** మండల పరిధిలోని పోతంశెట్టిపల్లి, కిష్టాపూర్, రాంపూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం తహశీల్దార్ చంద్రశేఖర్‌రావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యాన్ని త్వరితగతిన కొనుగోలు చేస్తూ లారీలు, ట్రాక్టర్ల ద్వారా వెంట వెంటనే తరలించాలన్నారు. రైస్‌మిల్లర్లు ఎక్కువ సంఖ్యలో హమాలీలను నియమించుకొని త్వరగా అన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం తూకం వేయాలని, తరుగు పేరిట రైతులను మోసం చేయవద్దన్నారు. ఈ కార్యక్రమంలో సీఈవోలు సాయిరెడ్డి, కృష్ణ, నవీన్, రైతులు తదితరులు ఉన్నారు.

## సాహితి మనోజ్ కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే



కుటుంబీకులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే క్రాంతికిరణ్

**టేక్మాల్, మే 27 ప్రభాతవార్త:** సాహితి మనోజ్‌ల కుటుంబాలను అందోల్ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ పరామర్శించారు. టేక్మాల్ మండల పార్టీ అధ్యక్షుని తమ్ముడు సురేష్ న్యాయవాది అల్లుడు మనోజ్ అమెరికాలో గుండెపోటుతో మృతి చెందగా భర్త మరణం తట్టుకోలేక కూతురు సాహితి ఆత్మహత్య చేసుకున్న విషయం తెల్సిందే. దీంతో రెండు కుటుంబాల్లోన తీవ్ర విషాదం మిగిల్చింది. మృతుల కుటుంబాలను ఎమ్మెల్యే క్రాంతికిరణ్ శనివారం వారి నివాసానికి వెళ్లి వారి మరణం పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ సంతాపం తెలియజేశారు. ఈయన వెంట మండల పార్టీ అధ్యక్షులు వీరప్ప, నాయకులు అవినాష్, సిద్దయ్య, భాస్కర్, రవి, రాజయ్య, సాయిలు, అడివప్ప, మహేంధర్‌లున్నారు.

## డంపింగ్ యార్డులో చెలరేగిన మంటలు.. ఆస్థినష్టం



డంపింగ్ యార్డులో చెలరేగుతున్న మంటలు

**సిద్దిపేట రూరల్, మే 27, ప్రభాతవార్త:** జిల్లా కేంద్రంలోని హౌసింగ్ బోర్డు కాలనీ సమీపంలోగల డ్రై రిసోర్స్ సెంటర్‌లో శనివారం పెద్ద యెత్తున్న మంటలు చెలరేగినట్లు కాలనీ వాసులు తెలిపారు. డ్రై రిసోర్స్ సెంటర్‌లో ప్లాస్టిక్ కవర్లను డీసీఎంలో లోడ్ చేస్తున్న క్రమంలో మంటలు చెలరేగినట్లు తెలిపారు. సంఘటనలో డిసిఎం, 2 కంప్యాకటర్లు సంఘటనలో కాలిపోయినట్లు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న అగ్నిమాపక శకటలు తరలివచ్చి మంటలను అర్పివేశారు. కాగా సంఘటన స్థలాన్ని మున్సిపల్ చైర్మన్ మంజులరాజనర్సు, సీపీ శ్వేత పరిశీలించి సంఘటన జరిగిన విషయాన్ని అడిగి తెలుసుకున్నారు.

## కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే అన్ని వర్గాలకు న్యాయం



నియామకం పత్రాన్ని అందిస్తున్న దృశ్యం

**బెజ్జంకి, మే 27, ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీ మండల యువజన విభాగం ఉపాధ్యక్షులుగా బేగంపేట గ్రామానికి చెందిన అన్నాజీ వెంకటేశం, ప్రధాన కార్యదర్శిగా ముత్తన్నపేట గ్రామానికి చెందిన మచ్చ వేణుకుమార్‌లను నియమించినట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ముక్కిస రత్నాకర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం ఇంచార్జి కవ్వంపల్లి సత్యనారాయణ చేతుల మీదుగా ఇరువురికి నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. నూతన ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి వెంకటేశం, వేణుకుమార్‌లు మాట్లాడుతు తమపై నమ్మకం ఉంచి పదవి అప్పగించిన పదవి రావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మాంకాలి ప్రవీణ్, రొడ్డ మల్లేశం, ఒగ్గు దామోదర్, రాజేందర్, దోనె వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## చాచా నెహ్రుకు కాంగ్రెస్ శ్రేణుల ఘన నివాళులు



భారత తొలిప్రధాని చాచా నెహ్రుకు ఘన నివాళి అర్పించిన కాంగి నేతలు

**హుస్నాబాద్‌టౌన్, మే27, ప్రభాతవార్త**

స్వాతంత్య్రం సిద్ధించిన అనంతరం భారతదేశ తొలిప్రధాని శ్రీపండిట్‌జవహర్‌లాల్‌నెహ్రు (చాచా) వర్ధంతి కార్యక్రమాన్ని హుస్నాబాద్‌పట్టణంలోని కాంగ్రెస్‌శ్రేణులు ఘనంగా నిర్వహించుకున్నాయి. ఈ సందర్భంగా చాచా నెహ్రు విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించి ఆయన దేశానికి చేసిన సేవలను మననం చేసుకుంటూ కీర్తించారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి సభ్యులు కేడం లింగమూర్తి, సింగిల్‌విండోచైర్మన్ బొలిశెట్టి శివయ్య, కౌన్సిలర్లు భూక్య సరోజన, మాజీ వార్డుసభ్యురాలు పచ్చిమట్ల రాధ, కౌన్సిలర్ వల్లపు రాజు. ఎస్‌సిసెల్ నాయకులు వెన్న రాజు, మాజీ ఎంపిటిసిసభ్యులు మహ్మద్‌హసన్, సోషల్‌మీడియా కన్వీనర్ కూన విశ్వతేజపటేల్, హుస్నాబాద్ స్వర్ణకార సంఘం మాజీ ఉపాధ్యక్షులు ముత్తోజు కుమారస్వామి పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ జిల్లా ముఖ్యనేతల సమావేశం

**మహేశ్వరం, మే 27, (ప్రభాతవార్త) :**

రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ నాయకుల సమావేశం శనివారం మహేశ్వర మండల కేంద్రంలో రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహ్మారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఏఐసీసీ కార్యదర్శి నవీన్ జావి ద్, ఏఐసీసీ స్పోక్ సభ్యుడు కన్నయ్య, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, జనరల్ సెక్రటరీలు జ్ఞానేశ్వర్ ముదిరాజ్, వేణుగౌడ్, చిరిగింత పారిజాత నర్సింహ్మారెడ్డి, జైపాల్‌రెడ్డి, మల్‌రెడ్డి రాంరెడ్డి, దేప భాస్కర్‌రెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యఓఉడు చల్లా నర్సింహ్మారెడ్డి మాట్లాడుతూ... టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పిలుపుమేరకు జూన్ 2 తేదిన తెలంగాణ రాష్ట్ర ఆవతరణ దినోత్సవం సందర్భంగా అమరవీరుల స్తూపం నుంచి గాంధీభవన్ వరకు భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమానికి రంగారెడ్డి జిల్లా నుంచి 10వే ల మంది కార్యకర్తలకు తగ్గకుండా తరలి వెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పీసీసీ ఉపాధ్యక్షులు, జనరల్ సెక్రటరీలు, సభ్యులు, జిల్లా ముఖ్య నాయకులు, మండల, బ్లాక్, డివిజన్, కార్పోరేషన్ అధ్యక్షులు, ఎస్సీ, ఎస్టీ, బీ సీ, మైనార్టీ సెల్ అధ్యక్షులు, మహిళా కాంగ్రెస్, ఎన్‌ఎస్‌యూఐ యూత్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యమంలో విప్పని నోర్లు నేడు ఎందుకు లేస్తున్నాయ్

**దుబ్బాక, మే 27, ప్రభాతవార్త:** మెదక్ పార్లమెంట్ సభ్యులు కొత్త ప్రభాకర్ రెడ్డి వారి ఆదేశానుసారం శనివారం అక్బర్‌పేట భూంపల్లి మండలం మోతె గ్రామంలో బిఆర్ ఎస్వీ, యువత, సోషల్ మీడియా, కమిటీల నిర్వహణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిఆర్ ఎస్వీ నియోజకవర్గ ఇంచార్జ్ పావని సురేష్ గౌడ్ మరియు స్థానిక మోతె సర్పంచ్ కాలేర్ శ్రీనివాస్, యువత తో కలిసి మాట్లాడుతూ దుబ్బాకలో ప్రతిపక్ష పార్టీలకు ఎందుకు ఓటు వెయ్యాలి... తెలంగాణ బిడ్డగా మనం ఉద్యమకారులుగా బిజేపి కాంగ్రెస్ పార్టీలకు నా సూటి ప్రశ్న..... నాడు ఉద్యమంలో విప్పని నోర్లు నేడు ఎందుకు లేస్తున్నాయ్, ఉద్యమబాట పట్టని మీకు, ఓటు ఎందుకు వెయ్యాలి అని ప్రశ్నించిన సందర్భం, నాడు తెలంగాణ ఉద్యమంలో లాఠీ దెబ్బలుతిన్న పార్టీ బిఆర్ఎస్ పార్టీ కదా అని ప్రశ్నించిన సందర్భంలోనిది, తెలంగాణ ఆత్మ గౌరవంకోసం నాలుగున్నర కోట్ల ప్రజలకోసం తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండ కేసీఆర్ ఆమరణనిరహార దీక్షకు పునకుంటే, ఆనాడు మీరెక్కడ అని కితాబివ్వడం జరిగింది. దుబ్బాక నియోజకవర్గంలో ప్రతిపక్షల పార్టీలు ఓట్లు అడిగే నైతిక హక్కు లేదు, మీకు రాబోయే రోజుల్లో మీకు డిపాజిట్లు గల్లంతు అయ్యే అవకాశం ఉంది, దుబ్బాకలో కాంగ్రెస్ బిజేపి పార్టీలు వాళ్ళ ఆరాటం పోరాటం కేవలం డిపాజిట్ల గురించే, అని ప్రశ్నించిన సందర్భంలోనిది. ఈ కార్యక్రమంలో మండల యువజన అధ్యక్షుడు చిలుక స్వామి, బొరేం యాదయ్య, కొత్త రాజిరెడ్డి, గుంటి రామేష్, బాల్ నర్సాగౌడ్, కోరంపల్లి మహేందర్, గుంటి దశరథం, ఎండి షఫీ, వడ్ల రాములు, మోతే యాదగిరి, మాయస చంద్రం, మాదాసు నగేష్, భాస్కర్, బుచ్చులు, యూసుఫ్, పోష ఎల్లం, రమేష్, బ్రహ్మచారి, యువత విద్యార్థి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## చౌక ధరల దుకాణములకు దరఖాస్తుల స్వీకరణ

**కీసర, మే27, ప్రభాతవార్తః**

చౌక ధరల దుకాణములకు ధరఖాస్తుల స్వీకరణ ఈ నెల 29 నుండి జూన్ 5వ తేదీ వరకు సీకరించునున్నట్లు ఆర్‌డిఓ రవి శనివారం ఒక ప్రకటనలో తెలిపా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని కరీంగూడ గ్రామానికి ఎస్ఈబిసి (ఏ), అంకిరెడ్డిపల్లి గ్రామానికి ఎస్‌టి, నాగారం మున్సిపాలిటీలో ఎస్‌టి, దమ్మాయిగూడ మున్సిపాలిటీలో స్పోర్ట్స్, ఎస్ఈబిసి ఏ (డబ్ల్యుఎస్), తిమ్మాయిపల్లి గ్రామానికి ఈడబ్ల్యుఎస్‌లకు ధరఖాస్తులు స్వీకరించబడునని తెలిపారు. 250 రూపాయలు చెల్లించి ధరఖాస్తు చేసుకోవాలన్నారు. చౌకధరల దుఖానములను నడుపుటకు 10వ తరగతి పాసై ఉండాలని, ఈ పైన విద్యార్హత కలిగిన నియమించుటకు అర్హులన్నారు. చౌకధరల దుఖానములకు సంబంధించిన గ్రామ పరిధిలో ఉండాలన్నారు. వయస్సు 18 నుండి 40 సంవత్సరాల లోపు మాత్రమే నియామకుమునకు అర్హులన్నారు. చౌకధరల దుఖాణ డీలరు నియా మకము అయినచో కనీసం 5 సంవత్సరాలు పని చేయాలన్నారు.

## పశువులకు దప్పికను తీర్చేది ఎలా?

**ధారూర్ మే27, ప్రభాతవార్త :**

వేసవి కాలంలో పశువులకు దప్పికాను తీర్చేందుకు అధికారులు నీటి తొట్టిలను నిర్మించారు. మండలం పరిధిలోని నర్సాపూర్ గ్రామంలో నిర్మించిన నీటి తొట్టి పూర్తిగా కూలిపోయింది. గ్రామస్తులు పలు మార్లు గ్రామ సర్పంచ్ పంచాయతీ కార్యదర్శికి విన్నవించుకున్న చూసి చూడనట్లు వ్యవహారిస్తున్నారన్నారని ప్రజలు వాపోయారు. అధికారులు స్పందించి నీటి తొట్టిని పున ఃనిర్మాణం చేపట్టి పశువు లకు నీటి ఎద్దడిని తిర్చేవిధంగా ఉపయోగంలోకి తీసుకురావాలని గ్రామస్తులు కొరుతున్నారు.

## బాధితుడికి సేల్‌ఫోన్ అందజేసిన పోలీస్‌లు

**కొడంగల్, మే27, ప్రభాతవార్త ః**

సిఈఐఆర్ యాప్ ద్వార సేల్‌ఫోన్ రికవరి చేసి భాదితుడికి అందజేయడం జరిగిందని ఎస్ఐ రవిగౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ నారాయణపేట్ జిల్లా దామరగిద్ద మండలం మొగల్ మడక గ్రామంకు చెందిన నర్సింహ ఈ నెల 15వ తేదిన తన సేల్‌ఫోన్ పోయిందని ఫిర్యాదే చేయడం జరిగిందన్నారు. ఫిర్యాదును స్వీకరించిన వెంటనే సిఈఐఆర్ యాప్ ద్వార విచార ణ చేయగా సేల్‌ఫోన్ రికవరీ కావడంతో శనివారం నాడు భాదితుడికి అందజే యడం జరిగిందనిఎస్ఐ రవిగౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, భాదితుడు పాల్గొన్నారు.

## జీవితంపై విరక్తితో ఉరేసుకొని మహిళా మృతి

**తలకొండపల్లి మే27, ప్రభాతవార్త :** తలకొండపల్లి మండల పరిధిలోని గట్టు ఇప్పలపల్లి గ్రామంలో శుక్రవారం ఒక మహిళ జీవితంపై విరక్తి చెంది తన తల్లి గారి ఊరైన గట్టుఇప్పలపల్లి గ్రామంలో ఫ్యానుకు ఉరి వేసుకుని మృతి చెందిన సంఘటన వెలుగులోకి వచ్చింది. అందుకు సంబంధించిన పోలీసులు కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం ....గట్టుఇప్పలపల్లి గ్రామానికి చెందిన ఇంద్రకంటి అంజమ్మ కూతురు ఆశ్వినిని 3 సంవత్సరాల క్రితం కేశంపేట మండలం కేంద్రా నికి చెందిన వెంకటేష్‌కు ఇచ్చి వివాహం జరిపించారు. వారికి కూతురు శ్రీవాన్ని, కుమారుడు అజిత్‌లు ఉన్నారు. ఆశ్విని చిన్నతనంలో క్షణికావేశంలో పురుగుల మందు సేవించింది. దీంతో వేసవికాలంలో తరచు అనారోగ్యానికి గురయ్యేది. బాధ ను భరించలేక తన భర్త వెంకటేష్‌తో తన తల్లిగారి ఊరైన గట్టుఇప్పలపల్లిలోని ఇంటికి తోలి రమ్మని చెప్పింది. దాంతో వెంకటేష్ తన భార్యను అత్తగారింట్లో తో లి వచ్చాడు. ఇంట్లో ఎవరు లేని సమయంలో శుక్రవారం మధ్యాహ్నం 3 : 30 గంటల సమయంలో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని మృతి చెందింది. కుటుంబ సభ్యులు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్పై వెంకటేష్ ఆధ్వ ర్యంలో పంచనామా నిర్వహించి మృతురాలి తల్లి అంజమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు.

## అవతరణ ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి మే 27, ప్రభాతవార్త**

రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్స వాలను ఘనంగ నిర్వహించటానికి ప్రజాప్రతినిధు లు, అధికారులు కృషి చేయాలని రాష్ట్ర మంత్రి మల్లారెడ్డి సూచించారు. శనివా రం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లోని ప్రజావాణి హాల్‌లో మేడ్చల్ నియోజవర్గ స్థాయి లో ప్రజాప్రతినిధులతో, అధికారులతో తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్స వాలను నిర్వహించటానికి సన్నాహక సమావేశంను నిర్వహించారు. దీనిలో జిల్లా కలెక్టర్ అమోయ్‌కుమార్ జిల్లా వాప్తంగ నిర్వహించే రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్స వాలను వివరించిన విధంగ జూన్ 2నుంచి 21రోజుల పాటు ప్రతి నిత్యం కార్యక్ర మాలను ఘనంగ నిర్వహించాలని మంత్రి మల్లారెడ్డి సూచించారు. మేడ్చల్ నియోజకవర్గంలోని ఎంపిపిలు, జడ్పీటిసిలు, ఎంపిటిసిలు, సర్పంచులు, చైర్మన్లు, వైస్‌చైర్మన్లు, కౌన్సిలర్లు, మేయర్లు, డిప్యూటీ మేయర్లు, కార్పోరేటర్లు, సంబంధిత అధికారులకు రోజు వారి కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. ప్రజాప్రతినిధు లు, అధికారులు సమన్వయంతో ఉండి రాష్ట్ర అవతరణ ఉత్సవాలను ఘనం నిర్వహించాలని మంత్రి మల్లారెడ్డి సూచించారు. జూన్ 2న కీసరలోని అమరవీ రుల స్థూపం వద్ద నివాళులు, ఆ తరువాత శామీర్‌పేట మండలంలోని కలెక్టరేట్ వద్ద జాతీయ పతాక ఆవిష్కరణను మంత్రి మల్లారెడ్డి చేయనున్నారు. 3న తెలం గాణ రైతు దినోత్సవం, 4న సురక్షా దినోత్సవం, 5న జిల్లా, మండల స్థాయిలో రైతులు, వినియోగదారులతో విద్యుత్ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులతో సమావేశం, 6న పారిశ్రామిక ప్రగతి ఉత్సవం, పారిశ్రామిక వాడల్లో, కారిడార్లో కార్యక్రమాలు, 7న సాగునీటి దినోత్సవం, 8న ఊరురా చెరువుల పండుగ, గ్రామపం చాయతీలు, నీటిపారుదల కార్యక్రమం, 9న తెలంగాణ సంక్షేమ కార్యక్రమం, 10న తెలంగాణ సుపరిపాలన దినోత్సవం, 11న తెలంగాణ సాహిత్య దినోత్స వం, 12న తెలంగాణ రన్ కార్యక్రమం, 13న మహిళా సంక్షే మ దినోత్సవం, 14న వైద్య, ఆరోగ్య దినోత్సవం, 15న పల్లె ప్రగతి దినోత్సవం, 16న తెలంగాణ పట్టణ ప్రగతి దినోత్సవం, 17న తెలంగాన గిరిజన దినోత్సవం, 18న మంచినీళ్ల పండుగ, 19న తెలంగాణ హరితోత్సవం, 20న తెలంగాన విద్యాదినోత్సవం, 21న ఆధ్యాత్మిక దినోత్సవం, 22న అమరుల సంస్మరణ దినోత్సవం కార్యక్ర మాలను జిల్లా వ్యాప్తంగ రోజు వారీగ నిర్వహించటం జరుగుతుందని అందరు పాల్గొని విజయవంతం చేయాలని మంత్రి సూచించారు.

# జూన్ 4న ఛలో కొత్తగూడెం

**-సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రామస్వామి**

**మొయినాబాద్, మే 27 ప్రభాతవార్త:**

భద్రాద్రి కొత్తగూడెంలో జూన్ 4న జరిగే సిపిఐ ప్రజా గర్జన బహిరంగ సభకు భారీగా తరలి రావాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.రామ స్వామి పిలుపునిచ్చారు. మొయినాబాద్ మండల కేంద్రంలో ప్రజాగర్జన బహిరంగ సభకు సంబంధించిన గోడపత్రికను ఆయన శనివారం ఆవిష్క రించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటికి సిపిఐ ప్ర జా పోరు జాత దేశ వ్యాప్తంగా గత నెల 14 నుంచి 15 వరకు జరి గిందని, దీనిలో భాగంగా జూన్ 4న భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని కొత్త గూడెం ప్రకాశం స్టేడియంలో సిపిఐ ఆధ్వర్యంలో ప్రజాగర్జన భారీ బహి రంగ జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ బహిరంగ సభకు ముఖ్య అతిథిగా సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా హాజరవుతున్నారని తెలిపారు. జిల్లా నుంచి పార్టీ శ్రేణులు, ప్రజా సంఘాల నాయకులు, కర్షకులు, కార్మికులు, రైతులు వేలాదిగా తరలి రావాలని ఆయన పిలుపు నిచ్చారు. గోడపత్రిక ఆవిష్కరణలో మొయినాబాద్ పార్టీ మండల కార్యద ర్శి శ్రీనివాస్, చేవెళ్ల మండల బికెయంయు కార్యదర్శి మల్లేష్, రవీంద ర్‌రెడ్డి, అర్జున్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

పండిట్ జవహాలాల్‌నెహ్రూకు నివాళ్లులు

# పేదల వద్దకు సిపిఎం

**శంకర్‌పల్లి, మే 27 ప్రభాతవార్త:**

పేదల సమస్యలు తెలుసుకునేందుకు సిపిఎం ఆధ్వర్యంలో పేదల వద్దకు సిపిఎం అనే కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పేదల సమస్యలపై సర్వే నిర్వహిస్తున్నట్లు సిపిఎం చేవెళ్ల డివిజన్ కన్వీనర్ అల్లి దేవేందర్, శంకర్‌పల్లి మండల కార్యదర్శి ఏనుగు మల్లారెడ్డి తెలిపారు. అయ్యప్పరెడ్డి గూడ, గణేష్‌నగర్, సింగాపురం, సాయినగర్ కాలనీలలో సిపిఎం సర్వే నిర్వహించిందని తెలిపారు. ఈ సర్వేలో పేదలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నట్లు గుర్తించామని వారు వివరించారు. తాగడానికి మంచినీరు, విద్యుత్ సరఫరా లేక, పిల్ల లు పెద్దలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. గత 20, 30 సంవత్సరాల నుంచి శంకర్‌పల్లి పట్టణంలో నివాసం ఉంటున్నా వారికి ఆధార్ కార్డులు లేవని, ప్రభుత్వ పథకాలు అందడం లేదని ఆవేద న వ్యక్తం చేశారని తెలిపారు. అటువంటి వారికి డబుల్ బెడ్ రూం ఇండ్లు మంజూరు చేయాలని, లేని పక్షంలో తాము పోరాటం నిర్వహిస్తామని తెలిపారు. శంకర్‌పల్లి పట్టణంలోని ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించా లని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు నరసింహ, శ్రీనివాస్, మల్లేష్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

**తలకొండపల్లి మే27, ప్రభాతవార్త :**

తలకొండపల్లి మండల పరిధిలోని పడమటి తండా గ్రామపంచాయతీ తాళ్లగుట్ట తండాకు చెందిన బిఆర్ఎస్ కార్యకర్త రాత్లావత్ పాండు నాయ క్ మాతృమూర్తి గత రెండు రోజుల కిందట మరణించింది. విషయం తెలుసుకున్న ఆమనగల్ మార్కెట్ కమిటీ చైర్మన్ నాలపురం శ్రీనివాస్ రెడ్డి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలుపుతూ వారి కుటుంబాని కి 3వేల రూపాయలను ఆర్థిక సహాయంగా అందజేశారు. ఈ కార్యక్రమం లో సర్పంచ్‌లు బుజ్జీ కృష్ణ నాయక్, గోపాల్ నాయక్, తలకొండపల్లి ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు పుల్య నాయక్, బిఆర్ఎస్ నాయకులు జబర్ నాయక్, లాలు నాయక్, తర్య నాయక్, నాయకులు, పాల్గొన్నారు.

## మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలి

**తలకొండపల్లి మే27, ప్రభాతవార్త :**

తలకొండపల్లి మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని ఎమ్మార్పిఎస్ రంగారెడ్డి జిల్లా కన్వీనర్ కృష్ణ మాదిగ పోతుగం టి డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ....తలకొండపల్లి మండలంలో ఎంతో మంది పదవ తరగతి చదువి ఇంటర్మీడియట్ చదవు కోసం అనేక మంది విద్యార్థులు పక్క ప్రాంతాలకు వెళ్లిపోవడం జరుగు తుందని వెళ్లే వీలు లేని వాళ్లు అంతా చదువు మానేసి కూలీలుగా ల్యాబ్ టెక్నీషీయన్లుగా మెకానికులుగా వివిధ రంగాలలో లేబర్లుగా మారుతున్న యువతీ యువకుల సంఖ్య పెరుగుతుందని అన్నారు. ముఖ్యంగా తలకొండపల్లి మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల లేకపోవడంతో పేద విద్యార్థులకు భవిష్యత్తు లేదన్న విషయం స్పష్టమవుతుందని అన్నారు. మన ప్రాంత ప్రజాప్రతినిధులు ప్రభుత్వ జూనియర్ కళాశాల తీసుకురావ డానికి ఎటువంటి చొరవ తీసుకోకపోవడం బాధకరమైన విషయమని గ్రా మ సర్పంచ్‌లు నుంచి మొదలు కొని అత్యున్నత స్థాయికి ఎదిగిన టువంటి ఎంపిటిసి, జడ్పిటిసి, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు కూడా నిర్లక్ష్యం వహించడం బాధాకరమైన విషయమన్నారు. ఈ విద్యా సంవత్సరంలో నైనా ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటుకు ప్రజాప్రతినిధులు మరి యు ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ కచ్చితంగా చొరవ చూపాలని లేని పక్షాన జీవితాన్ని కోల్పోతున్న విద్యార్థుల తల్లిదండ్రులతో అంతా ఏకమై తలకొం డపల్లి మండల ప్రజాప్రతినిధుల ఇంటి ముందు ధర్నాకు సిద్ధమవుతామని హెచ్చరించారు. కలిసి పోరాడి కాలేజీ సాధించుకుందామని పేర్కొన్నారు.

## ఎంఆర్ఓకు వినతి పత్రం అందజేసిన రైతులు

**తలకొండపల్లి మే27, ప్రభాతవార్త :**

తలకొండపల్లి మండల పరిధిలోని చీపునుంతల గ్రామానికి చెందిన రైతులు 50 సంవత్సరాలుగా వ్యవసాయ చేసుకుంటున్న పొడు భూము లను ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ వారు అక్రమంగా రైతులను బెదిరించి వారి వద్ద ఉన్న పట్టా పుస్తకాలు తీసుకొని రైతులకు భూమి లేకుండా చేశారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో శనివారం మండల ఎంఆర్ఓ కు రైతులు వినతిపత్రం అందజేసి మాభూములపై మాకు హక్కు కల్పిం చి పట్టాలు ఇప్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గడ్డమీది బాలయ్య, కొట్ర గోపాల్, కొట్ర రామయ్య, గొస్కె లక్ష్మయ్య, గిరి, యాదమ్మ, గోపాల్, చెన్నకేశవులు, బోయ రాములు, మల్లయ్య, నర్సిహ్మ, పాల్గొన్నారు.

## సంస్కృతి టౌన్‌షిప్‌లో రక్తదాన శిబిరం

**ఘట్‌కేసర్ రూరల్, మే 27, ప్రభాతవార్త:**

పోచారం మున్సిపల్ సంస్కృతి టౌన్‌షిప్‌లో శనివారం నిర్వహించిన రక్తదాన శిబిరంలో 20 మంది పాల్గొన్నట్లు స్థానిక కౌన్సిలర్, అసోసియే షన్ అధ్యక్షుడు బెజ్జంకి హరిప్రసాద్‌రావు తెలిపారు. ఘట్‌కేసర్ ప్రభుత్వ జిల్లా వైద్యవిధాన పరిషత్ ఆస్పత్రి వారు రక్తదాన శిబిరానికి విచ్చేసి రక్తా న్ని సేకరించినట్లు తెలిపారు. రక్తదాన శిబిర నిర్వహణ డాక్టర్ మహేందర్ ఆధ్వర్యంలో రక్తాన్ని సేకరించినట్లు తెలిపారు. రక్తదాన శిబిరాన్ని స్థానిక మున్సిపల్ కౌన్సిలర్ హరిప్రసాద్‌రావు రిబ్బన్ కత్తిరించి ప్రారంభోత్సవం చేసినట్లు తెలిపారు. అనంతరం కౌన్సిలర్ రక్తాన్ని దానం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య అధికారులతో పాటు టౌన్‌షిప్ సభ్యు డు జేవీకే ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## మహేశ్వరం శివగంగ పుష్కరిణిలో పడి వ్యక్తి మృతి

**మహేశ్వరం, మే 27, (ప్రభాతవార్త) :** మహేశ్వరం శ్రీ శివగంగా రాజ రాజేశ్వరాలయం పుష్కరిణిలో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. మహేశ్వరం పోలీసుల కథనం ప్రకారం వివ రాలు ఇలా ఉన్నాయి. కందుకూరు మండలం సరస్వతీగూడ గ్రామానికి చెందిన మామిళ్ల యాదయ్య (30) అనారోగ్య సమస్యలతో బాధపడుతూ మహేశ్వరం శివగంగా ఆలయానికి వెల్తునానని కుటుంబ సభ్యులకు చెప్పి మహేశ్వరం వచ్చిన తర్వాత అతని మేన బావ బోడ ప్రభాకర్‌కు ఫోన్ చేసి నేను చనిపోతున్నానని శివగంగ పుష్కరిణిలో దూకి ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు తెలిపారు. మృతుని తల్లి మామిళ్ల పెంటమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై నర్సింహ్మ మృతుని శవాన్ని వెలికి తీయించి పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## రైతు రుణమాఫీని వెంటనే చేపట్టాలి : కోరే జగదీష్‌రావు

**యాచారం, మే 27 ప్రభాతవార్త**

బిఆర్ఎస్ ప్రభుత్వం గత ఎన్నికల సమయంలో లక్ష రూపాయల లోపు పంట రుణాలను మాఫీ చేస్తామని ఇచ్చిన హామీ నేటి వరకు అమలు చేయ లేదని, వెంటనే రైతు రుణమాఫీని చేపట్టాలని మండల కాంగ్రెస్ పార్టీ ప్రధా న కార్యదర్శి కోరే జగదీష్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఆయన స్థానికంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీకి సంబంధించి మూడుసార్లు అసెంబ్లీలో ప్రకటించి బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడం తో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారన్నారు. అరొకరగా రూ. 25 వేల వరకే రుణమాఫీ చేసిందని, పూర్తి స్థాయిలో రుణమాఫీ చేయలేదని విమర్శిం చారు. బిఆర్ఎస్ పార్టీ రుణమాఫీ చేస్తామని మేనిఫెస్టోలో ప్రకటించి అధికా రంలోకి వచ్చిందని గుర్తు చేశారు. అధికారంలో వచ్చి నాలుగేళ్లు పూర్తి కావస్తు న్నా పూర్తి స్థాయిలో రుణమాఫీ చేయకుండా ఊరిస్తూ కాలం వెల్లదీస్తుందని విమర్శించారు. బ్యాంకుల్లో వడ్డీకి వడ్డీ జమ చేస్తూ రైతులకు రుణభారాన్ని మోపుతున్నారన్నారు. ప్రభుత్వం రుణమాఫీ చేస్తుందనే ఆశతో రైతులు ఉన్నారన్నారు. రుణమాఫీ కాకపోవడంతో బ్యాంకర్లు రైతులపై రుణాలు చెల్లించాలని ఒత్తిడి చేస్తున్నారని, వెంటనే ప్రభుత్వం రైతు రుణమాఫీ పూర్తి చేసి రైతులను ఆదుకోవాలని లేని పక్షంలో రైతుల పక్షాన ఉద్యమిస్తామన్నారు.

## భారత దేశ ఐక్యత కొరకు హిందువులు కృషి చేయాలి

**-ఆర్ఎస్ఎస్ దక్షిణ మధ్యక్షేత్ర ప్రచారక్ శ్రీరామ్ భారత్**

**ఘట్‌కేసర్ రూరల్, మే 27, ప్రభాతవార్త:**

దేశ ఐక్యత కొరకు హిందువులు సమిష్టి కృషి చేయాలని దక్షిణ మధ్యక్షేత్ర ప్రచారక్ శ్రీరామ్ భారత్ అన్నారు. పోచారం మున్సిపల్ పరిధిలోని అన్నోజి గూడ శ్రీవిద్యావిహార్ ఉన్నత పాఠశాలలో శుక్ర వారం రాత్రి జరిగిన ఆర్ఎస్ఎస్ తెలంగాణ సంఘ శిక్షావర్గ ప్రథమ వర్ష ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లా డుతూ దేశాభివృద్ధిలో హిందువులంతా భాగస్వాములు కావాలని అన్నారు. రా ష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ తన శాఖల నిర్వహణ ద్వారా సమాజ మార్పు కొరకు యువతకు అవగాహన కల్పిస్తుందని అన్నారు. దేశంలో కుటుంబ వ్యవ స్థను చిన్నభిన్నం చేయడానికి ప్రాశ్యాత సంస్కతియే కారణమని అన్నారు. మన దేశ సంస్కతి సంప్రదాయాలే ప్రపంచానికి మార్గదర్శనం చూపుతున్నాయని అన్నారు. మన దేశం హిందుత్వం ఆధారంగానే ప్రపంచంలో విశ్వగురువుగా నిలిచేందుకు కృషి చేస్తుందని అన్నారు. దేశంలో రామమందిర నిర్మాణం కొరకు దేశంలోని అన్ని ప్రాంతాల ప్రజలు భాగస్వామ్యులు కావడం హిందుత్వ ఐక్యత కు నిదర్శనమని అన్నారు. ఈ సందర్భంగా స్వయం సేవకులు చేసిన విన్యాసా లు, కర్రసాము వంటి కార్యక్రమాలు చూపరులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్ర మంలో సెంట్రల్ ఎక్సైజ్ కస్టమ్స్ రిటైర్డ్ డిప్యూటీ కమిషనర్ కె. సాంబిరెడ్డి, చల్లా వివేకా నందారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలు నిర్వహించాలి

**ఘట్‌కేసర్, మే 27, ప్రభాతవార్త:**

ప్రభుత్వ ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్స వాలను నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని మేడ్చల్ డిఎంహెచ్ఓ డాక్టర్ పుట్ల శ్రీనివాస్ అన్నారు. ఘట్‌కేసర్ సామాజిక ఆరోగ్య కేంద్రంలో వైద్యఆరోగ్యశాఖ సమన్వయ సమావేశం నిర్వహించారు. డిఎంహెచ్ఓ శ్రీనివాస్, డిసిహెచ్ఎస్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ కోట్యానాయక్‌తో కలిసి వైద్యసేవలపై వైద్యులు, సిబ్బందితో సమీక్ష జరిపారు. జూన్ 14న వైద్య ఆరోగ్యశాఖ పండ్లు పంపిణీ, బహిరంగసభ నిర్వహించి 10 సంవత్సరాల సంపూర్ణ పురోగతిని, ఉత్తమ డాక్టర్, స్టాఫ్‌నర్స్, ల్యాబ్ టెక్నిషియన్లకు అవార్డులు ప్రజాప్రతినిధుల సమీక్షంలో అందజేయాలని సూచించారు. ఆసు పత్రిలో మాతా ఆరోగ్య సేవలను బలో పేతం చేయడం, 24 గంటల పాటు కాన్పులు, ల్యాబ్, అత్యవసర శస్త్రచికిత్సలు సిహెచ్‌సీలో నిర్వహించాలని పేర్కొన్నారు. జిల్లాలో సి-సెక్షన్‌లను తగ్గించా లని ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు ఆదేశించారని గైనకాలజిస్ట్, అనస్థీషియా. వైద్యులకు అవా ంఛిత సిజేరియన్‌లను తగ్గించడం, సాధారణ ప్రసవాలను ప్రోత్స హించడమే లక్ష్యంగా పెట్టుకోవాలన్నారు. అన ంతరం డిఎంహెచ్ఓ న్యూట్రి షన్ కిట్ స్టోర్ రూమ్ ఏర్పాట్లు, యునానీ క్లినిక్ ను తనిఖీ చేసి నిర్వహణపై ఆరా తీశారు.

## మృతుల కుటుంబాలకు మల్లారెడ్డి సేవాట్రస్టు ఆర్థిక సాయం

**ఘట్‌కేసర్, మే 27, ప్రభాతవార్త:**

ఘట్‌కేసర్ మండలం ఎదులాబాద్‌లో మృతిచెందిన నలుగురు కుటుంబాలకు మంత్రి మల్లారెడ్డి సేవా ట్రస్టు ద్వారా ఆర్థికసాయ ం అందజేశారు. ఎదులాబాద్ గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో కాలేరు కాళీదాసు, రాచకట్ల సాయిచరణ్, మ్యాకల బాలుగౌడ్, కూరం శ్రీహరిలు మృతిచెందారు. ఈవిషయాన్ని స్థానిక ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్‌పార్టీ నాయకులు మంత్రి మల్లారెడ్డి దృష్టికి తీసు కువెళ్లారు. ఈమేరకు మల్లారెడ్డి సేవా ట్రస్టు ద్వారా ఒక్కో కుటుంబానికి రూ.5,000ల చొప్పున మొత్తం రూ.20 వేలు అందజేశారు. స్థానిక నాయకు లు శనివారం మృతుల కుటుంబాలను పరామర్శించి ఐదు వేల రుపాయలను అందించారు. ఈకార్యక్రమంలో ఉపసర్పంచ్ ఉప్పు లింగేశ్వరరావు, గ్రామ బీఆర్ఎస్‌పార్టీ అధ్యక్షులు అల్లం శంకర్, ప్రధానకార్యదర్శి కొత్తన్‌పోన్ చిరంజీవి, మాజీ వార్డుసభ్యులు బింగి సురేష్‌గౌడ్, నాయకులు కందుల మహేశ్, గుమ్మడి నర్సింహ్మ, మెంగ బాల్‌క్రిష్ణ, అరవింద్‌రెడ్డి, మల్లారెడ్డి సేవా ట్రస్టు ప్రతినిధి వేణుగోవిందుడు పాల్గొన్నారు.

## పండిట్ జవహాలాల్‌నెహ్రూకు నివాళి

**-మండల ఎన్ఎస్‌యుఐ అధ్యక్షుడు శబ్బుద్దిన్**

**కడ్తాల్, మే 27 ప్రభాతవార్త :**

స్వాతంత్య్ర సమరయోధుడు, భారతదేశ తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ వర్ధంతి సందర్భంగా కడ్తాల్ మండల కేంద్రంలో ఎన్ఎస్‌యుఐ మండల అధ్యక్షుడు శబ్బుద్దిన్ ఆధ్వర్యంలో నాయకులతో కలిసి ఫొటోకి పూలమాలలు వేసి వారి ఆశయాలను కొనసాగించాలని కోరుతూ నివాళులు అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా కడ్తాల్ మండల ఎన్ఎస్‌యుఐ అధ్యక్షుడు శబ్బుద్దిన్ మాట్లాడుతూ జవహర్‌లాల్ నెహ్రూ మన భారతదేశ స్వాతంత్య్ర సంగ్రామ పోరాట యోధుడని భారత స్వాతంత్ర సంగ్రామంలో ముఖ్యపాత్ర పోషించిన మహనీయుల లో జవహర్‌లాల్ నెహ్రూ ఒకరని కొనియాడారు. బడుగు బలహీనవర్గాల ప్రజలకు విధి విధానాలను రూపొందించి దిశ నిర్దేశం చేసిన వ్యక్తి జవహ ర్‌లాల్ నెహ్రూ అన్నారు. దీర్ఘకాలం కొనసాగిన భారత సంగ్రామంలో ముఖ్యపాత్ర వహించి దేశతొలి ప్రధానిగా దేశానికి చేసిన సేవలను గుర్తు చేసుకుంటూ తన ఆశయాలను కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో అజ్గర్‌అలీ, క్యామ రాజేష్, ఎర్రోళ్ల శ్రీకాంత్, లింగం, యూత్ కాంగ్రెస్ టౌన్ అధ్యక్షులు భానుకిరణ్, ఎన్ఎస్‌యుఐ టౌన్ అధ్యక్షులు వంశీ, పవ న్, దర్శన్, టిల్లు, లడ్డు పాల్గొన్నారు.

## రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించాలి

**-రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు పద్మ నరసింహ ముదిరాజ్**

**తలకొండపల్లి మే27, ప్రభాతవార్త :**

రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించాలని రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు పద్మ నరసింహ ముదిరాజ్ పేర్కొన్నారు. శనివారం తలకొండపల్లి మండల కేంద్రంలో రైతు వేదికలో ఏర్పాటు విలేకరల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..రైతులు ఆరుకాలం కష్టపడి పండిం చే పంటలను కొందరు దళారులు, పక్క రాష్ట్రాల నుంచి నాసిరకం విత్తనాలు తేవడం జరుగుతుందని దాని ద్వారా రైతులు చాలా నష్టపోతు న్నారని ప్రతి ఒక్క డీలర్ రైతులు నష్టపోయేటట్లు నాసరికం మందులు అమ్మ కూడాదని ప్రతి ఒక్కరూ నాణ్యమైన విత్తనాలను రైతులకు అం దించాలని రైతులకు అన్ని విధాలుగా సహకరించాలని వాళ్లకి పంట పట్ల అవగాహన కల్పించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల అన్ని విధాలు గా తోడు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సమన్వయ సమితి గ్రామ అధ్యక్షుడు పాండు యాదవ్ ,బిఆర్ఎస్ మండల వైస్ ప్రెసిడెంట్ మల్లేష్, పోతుగంటి కుమార్, నర్సింహ, గణేష్, శ్రీరాములు, యాదయ్య, చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

## చిరు వ్యాపారులకు గొడుగుల పంపిణీ

**కడ్తాల్, మే 27 ప్రభాతవార్త :**

కడ్తాల్ మండల కేంద్రంలోని ఫుట్‌పాత్‌లపై బతుకు దెరువు కోసం చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటున్న చిరు వ్యాపారుల ఇబ్బందులను గమ నించిన ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి సమకూర్చిన గొడుగులను శనివారం ఐక్యత ఫౌండేషన్ సభ్యులు 45 మందికి పంపిణీ చేశారు. ఎండలు ఎక్కువ గా ఉండడంతో, వానలు కూడా కురు స్తుండడంతో వారికి రక్షణగా ఉండేందుకు గొడుగులు పంపిణీ చేశామని ఫౌండేషన్ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఐక్యత ఫౌండేషన్ సభ్యులు, చిరు వ్యాపారులు పాల్గొన్నారు.

## రోడ్డు పనులను పరిశీలించిన నాయకులు

**మహేశ్వరం, మే 27, (ప్రభాతవార్త) :**

పెండ్యాల రోడ్డు నుంచి గట్టుపల్లి రోడ్డు వరకు వయా రామచంద్రగూడ బీటీ రోడ్డు 35లక్షలతో వేయడం జరుగుతుందని, విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి సహకారంతో జరుగుతున్న పనులను శనివారం రామ చంద్రగూడ సర్పంచి ఆంగోని సనీవీ రాజు నాయక్ తదితరులు కలిసి పరిశీంచారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుడు సిద్దేశ్వర్‌గౌడ్, రెడ్యా నాయక్, శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

